

ఐఫ్ఆర్, మిలాన్ నిర్వహణపై సమీక్ష

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

భారత నౌకాదళం ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్, అయాన్స్ కాన్క్లేవ్ ఆఫ్ చీఫ్స్ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత కమాండర్ ఐఎఫ్ఆర్ ఎటీ మాథ్యూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏ శాఖ ఏయే విధులు నిర్వహించాలో వివరించారు. దానికి అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అన్ని

... మిగతా 6వ పేజీలో

స్టేషన్‌లో ఎండ్ ప్లాట్‌ఫారం

72 మీటర్ల వెడల్పున కారిడార్ (ఎయిర్ కాంకోర్స్) నిర్మాణం

ప్రయాణికులు ఓవర్ బ్రిడ్జి ఎక్కాల్సిన అవసరం లేకుండా ఏ ప్లాట్‌ఫారంపైకి అయినా వెళ్లేందుకు అవకాశం

- కేకే లైన్‌కు రక్షణ కల్పిస్తాం
- కొండ చరియలు విరిగి పడకుండా ఐరన్ నెట్లు ఏర్పాటు
- విశాఖ-పలాస ట్రాక్‌కు ఫెన్సింగ్
- రైళ్ల వేగం 130 కి.మీ. నుంచి 160 కి.మీ.కు పెంపు
- జీఎం కార్యాలయం కోసం రెండు, మూడు భవనాల పరిశీలన
- విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా



డీఆర్ఎం లలిత్ బొహ్రా



రైల్వే స్టేషన్‌లో నిర్మించనున్న కాంకోర్స్ (కారిడార్) నమూనా

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో హౌరా స్టేషన్‌లో మాదిరిగా 'ఎండ్ ప్లాట్‌ఫారం' నిర్మించనున్నామని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా తెలిపారు. ప్రయాణికులు ఓవర్ బ్రిడ్జి ఎక్కాల్సిన అవసరం లేకుండా దాదాపు 72 మీటర్ల వెడల్పున ఎయిర్ కాంకోర్స్ (కారిడార్) నిర్మిస్తామన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్‌లో ప్రయాణికులు ఒకటో నంబరు ప్లాట్‌ఫారం నుంచి ఇతర ప్లాట్‌ఫారాలకు ఆ కారిడార్‌లో నడుచుకుంటూ వెళ్లిపోవచ్చునన్నారు. దానికి ఇరు వైపులా షాపులు, క్యాంటీన్లు, ఇతర వస్తువులు విక్రయించే దుకాణాలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ఇక్కడి స్టేషన్‌లో దిగే ప్రయాణికులు భవిష్యత్తులో మెట్రో రైలు కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇదే కారిడార్ (ఎయిర్ కాంకోర్స్) నుంచి ఆ స్టేషన్‌కు వెళ్లే ఏర్పాటు కూడా ఉంటుందన్నారు. దీనికి సంబంధించి మెట్రో ప్రాజెక్టు అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు.

కొత్తవలస-కిరండూల్ (కేకే) రైలు మార్గంలో వర్షాకాలంలో కొండ చరియలు విరిగిపడి రాకపోకలకు తరచూ అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో వాటి నివారణకు పలు చర్యలు చేపట్టినట్టు విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ భారీగా కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఐరన్ నెట్లు (ఇనుప వలలు) పెడుతున్నామన్నారు. పెద్ద పెద్ద రాళ్లు పడినప్పుడు వాటిని నెట్లు ఆపలేకపోయినా నష్టం కొంత మేర తగ్గుతుందన్నారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో కేవలం మట్టి కొట్టుకు వచ్చి పేరుకుపోతున్నదని, అక్కడ రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడలు) నిర్మిస్తున్నామన్నారు. ఈ చర్యల వల్ల కొంత వర్ష రైలు మార్గానికి రక్షణ కలుగుతుందన్నారు.

పెట్రోలింగ్ సిబ్బందికి జీపీఎస్‌లు

ఎత్తైన కొండ ప్రాంతాల్లో పనిచేసే గ్యాంగ్ మెన్ (పెట్రోలింగ్ సిబ్బంది)కు ఎలా పని చేయాలనే అంశంపై ఇటీవల డార్జిలింగ్‌లో

... మిగతా 6వ పేజీలో

జడ్పీ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి గళం

- నిధుల కేటాయింపులో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని సొంత పార్టీ సభ్యుల ఆరోపణ
- కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోరని మరికొందరి ఫిర్యాదు
- బుజ్జగించిన నేతలు
- బొత్స కార్యాలయంలో పంచాయితీ
- అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌కు ప్రస్తుతానికి నో
- అందరినీ జగన్ వద్దకు తీసుకువెళతానన్న బొత్స



బొత్స కార్యాలయం బయట వేచివున్న జడ్పీటీసీ సభ్యులు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు, స్వపక్షానికి చెందిన జడ్పీటీసీ సభ్యులకు మధ్య తలెత్తిన విభేదాలపై శుక్రవారం బీచ్‌రోడ్డులో గల వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కార్యాలయంలో పంచాయితీ జరిగింది. ఈ సమావేశానికి అరకులోయ, పాడేరు ఎమ్మెల్యేలు రేగా మత్స్యలింగం, కిముడు విశ్వేశ్వరరాజు, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, కంబాల జోగులు, అదీప్‌రాజ్, జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తీరుపై అత్యధిక జడ్పీటీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనికి సంబంధించి అందిన వివరాలిలా ఉన్నాయి.

సమావేశంలో తొలుత జడ్పీటీసీ సభ్యుల అభిప్రాయాలను నాయకులు తెలుసుకున్నారు. దాదాపు సభ్యులంతా చైర్‌పర్సన్ వ్యవహారశైలిని తప్పుబడుతూ మాట్లాడారు. జడ్పీ కార్యాలయానికి వచ్చినా తమను పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపించారు. నిధుల కేటాయింపులో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని మరికొందరు ఫిర్యాదుచేశారు. అయితే అధిష్ఠానం నిర్ణయం మేరకు నడుచుకుంటామని, పార్టీకి ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేయబోమని

... మిగతా 6వ పేజీలో

విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ నిర్ణయం

- ప్రతి విద్యార్థి మొక్క పెంచేలా ప్రోత్సాహం
- మూడు నెలలకొకసారి ఆ మొక్క పురోగతి పాస్‌పోర్టులో నమోదు
- ఐదు పాయింట్లు కేటాయింపు
- జిల్లాలో ఇప్పటివరకూ పేర్లు నమోదుచేసుకున్నవారు 56,395 మంది
- పాఠశాల కేంద్రంగా మొక్కల పంపిణీ



నడుపూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందజేసిన మొక్కలు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర విద్యా శాఖ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రతి విద్యార్థి మొక్కలు పెంచేలా ఒక కార్యక్రమాన్ని చేపట్టింది.

మొక్కల పెంపకం కోసం ముందుకు వచ్చే ప్రతి విద్యార్థికి గురువారం నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ సమావేశాల్లో గ్రీన్ పాస్‌పోర్టు (పుస్తకం) అందజేశారు. సబ్జెక్టులకు సంబంధించి ప్రోగ్రెస్ రిపోర్టు ఇస్తున్నట్టుగా విద్యార్థి పెంచే మొక్క పేరు, శాస్త్రీయ నామం, వ్యవహారిక నామం వంటి వివరాలు ఆ గ్రీన్ పాస్‌పోర్టులో నమోదుచేస్తారు. విద్యార్థులంతా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు స్థలం సరిపోదు. కాబట్టి ఇష్టమైన చోట అంటే ఇంటి ఆవరణ, పెరడు, పొలాల గట్లు, గ్రామం/వార్డులో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాల్లో నాటుకోవచ్చు. అయితే మూడు నెలలకొకసారి మొక్కల పెరుగుదల వివరాలను గ్రీన్ పాస్‌పోర్టులో నమోదుచేయాలి. ఏడాదికి రెండుసార్లు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తనిఖీ చేసి సంతకం చేయాలి. దానికి అనుగుణంగా ప్రతి విద్యార్థికి గరిష్ఠంగా ఐదు పాయింట్లు లభిస్తాయి. రాష్ట్రంలో విద్యార్థులు కోటి మొక్కలు నాటాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపునకు ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. దీనిపై విద్యాశాఖాధికారులతో ఆయన సమావేశమై మెగా పేరెంట్ టీచర్ సమావేశాల రోజున విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలని, పెంపకంపై వారిలో ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ఇందుకుగాను విద్యార్థి అందజేసేందుకు 'మొక్క ఎదుగుదలతో నా ప్రయాణం' అనే ట్యాగ్‌తో గ్రీన్‌పాసుపోర్టు పుస్తకం ముద్రించారు. అవసరమైన మొక్కలు పంపిణీ చేయాలని సామాజిక అటవీ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. విశాఖ జిల్లాలో 1,338 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో 1,309 పాఠశాలలు గ్రీన్ పాస్‌పోర్టు యాప్‌లో

... మిగతా 6వ పేజీలో

పేదరికం లేని సమాజమే లక్ష్యం

పి-4 కార్యాచరణపై ఇన్‌చార్జి మంత్రి డోలా సమీక్ష

- జిల్లాలో 73,452 బంగారు కుటుంబాలు
- మరోసారి పునఃపరిశీలన అనంతరం మార్గదర్శకుల ఎంపిక
- చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన విషయంలో తోడ్పాటు



పి-4 కార్యాచరణపై శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారుల సమావేశం. (ఇన్‌సెట్‌లో) సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

పేదరికం లేని సమాజాన్ని రూపొందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పి-4 కార్యాచరణపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో 73,452 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు పీ-4 (పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్ట్‌నర్‌షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను మరోసారి పునఃపరిశీలన

... మిగతా 6వ పేజీలో

సచివాలయాలకు తాళాలు



శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తాళాలు వేసి ఉన్న సచివాలయాలు

సాగర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో ఉన్న మూడు సచివాలయాలు శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తాళాలతో దర్శనమిచ్చాయి. ఎనిమిదో వార్డుకు సంబంధించిన మూడు సచివాలయాలను పీహెచ్‌సీ భవనంలో ఏర్పాటుచేశారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం మూడు కూడా మూతపడి ఉన్నాయి. అక్కడ సమాధానం చెప్పడానికి కూడా ఎవరూ అందుబాటులో లేరు. దీంతో వివిధ పనులపై వచ్చినవారు నిరాశతో వెనుతిరిగారు. ఈ విషయమై సిబ్బందిని ఫోన్‌లో వివరణ కోరగా ఒక కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో ఏ ప్రమాదం జరగకుండా ముందస్తుగా తాళాలు వేసినట్టు చెప్పుకొచ్చారు. అందులో ఎంతవరకూ వాస్తవం ఉందనేది అధికారులు విచారిస్తే గానీ తేలదు. - సాగర్‌నగర్/ఆంధ్రజ్యోతి

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితాలు

- అర్జీలకు రేపే చివరిరోజు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని గ్రామీణ మండలాల పరిధిలోని 57 రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలు ప్రదర్శించినట్టు వ్యవసాయాధికారి అప్పలస్వామి తెలిపారు. అన్నదాత సుఖీభవకు జిల్లాలో మొత్తం 17,776 మంది అర్హులుగా గుర్తించామన్నారు. పద్మనాభం మండలంలో 6,417 మంది, ఆనందపురం మండలంలో 4,717, భీమిలి మండలంలో 3,286, పెందుర్తి మండలంలో 2,839, పెదగంట్యాడలో 256, గాజువాక మండలంలో 206 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరంతా తమ పరిధిలో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి జాబితాలో తమ పేర్లు ఉన్నాయా? లేదో...పరిశీలించుకోవాలన్నారు. ఒకవేళ పేర్లు లేకపోతే రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుడిని కలిసి ఈనెల

... మిగతా 6వ పేజీలో

ఏఎంసీ డైరెక్టర్లుగా ఇద్దరి నియామకం

ఆనందపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలానికి చెందిన ఇద్దరికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. బీజేపీ తరఫున పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాడ గౌరి, జనసేన తరఫున ఆనందపురం పంచాయతీకి చెందిన కుప్ప రామలక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉప్పాడ అప్పారావు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి అతని భార్య గౌరిని డైరెక్టర్‌గా నియమించారు. అలాగే కుప్ప రామలక్ష్మి జై జవాన్ ఫౌండేషన్ ద్వారా ప్రజా సేవ చేయడంతో పాటు జనసేన పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం,జూలై 11 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఆర్‌పీలకు ట్యాబ్‌లు పంపిణీ

సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పదిమంది ఆర్‌పీలకు కార్పొరేటర్ పీవీ నరసింహం శుక్రవారం ట్యాబ్‌లు అందజేశారు. వార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూసీడీ ఏపీడీ చిరంజీవితో కలిసి వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్‌పీ పనితీరులో పారదర్శకత పెంచేందుకు ట్యాబ్‌లు అందజేసిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలకు మరింత మెరుగైన సేవలందజేయాలని ఆయన సూచించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు భేష్

సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రదక్షిణలో పారిశుధ్య కార్మికుల సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. దేవస్థానం పారిశుధ్య కార్మికులు, జీవీఎంసీ సిబ్బంది కొండ దిగువన వేపగుంట కూడలి నుంచి పాతగోశాల, తొలిపావంచా మీదుగా పాత అడివివరం కూడలి వరకు భక్తులు రాకపోకలు ముగిసిన వెంటనే వీధులను, రోడ్లను శుభ్ర చేయడం పట్ల ప్రజలు వారి సేవలను కొనియాడుతున్నారు.

అప్పన్న రాజగోపురానికి తేనెపట్లు



సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన రాజగోపురానికి రెండు తేనెపట్లు పట్టాయి. ఏటా అదే ప్రాంతంలో పెద్ద తేనె పట్టు ఏర్పడడం షరా మామూలే. గత ఏడాది అలయ సిబ్బంది తేనెపట్టును తొలగించి రసాయనాల సహాయంతో మరో సారి పట్టు ఏర్పకుండా చర్యలు చేపట్టారు. కానీ యథాస్థానంలో మళ్లీ తేనెపట్లు పట్టాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సిబ్బంది భయపడుతున్నారు.

అక్రమ భవన నిర్మాణంపై ఫిర్యాదు

మధురవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని ఆర్‌టీసీ డిపో రోడ్డులో ఒక భవనంపై అక్రమంగా తొమ్మిదవ అంతస్తు నిర్మిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ మేయర్ పీలా శ్రీనివాస్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.ఈమేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె మేయర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అక్రమ భవన నిర్మాణంపై స్థానిక సచివాలయం సిబ్బంది యాజమాన్యాన్ని ప్రశ్నించినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. వెంటనే పనులను నిలిపివేయించాలని కోరారు.

విద్యార్థులకు కంచాలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమనాం ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాయి సంహిత సంస్థ ఆరవై స్టీలు కంచాలను శుక్రవారం పంపిణీ చేసింది. వీటిని ఈ సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఒక పాఠశాలకు అవసరమైన సామగ్రి అందజేస్తున్నామన్నారు. అమనాం పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి కంచాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిసి, వితరణ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ డి. సూర్యనారాయణరాజు సర్పంచ్ ఉమా దేవి, ఉప సర్పంచ్ చిట్టిబాబు, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు వినతి



తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం ఇస్తున్న నివాసితులు

తగరపువలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు పరిధిలో సర్వే నంబరు 53లో నివాసం ఉంటున్నతమ ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఆ వార్డు ప్రజలు తహసీల్దార్ రామారావును కోరారు. శుక్రవారం వారు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నామని, ఇళ్లను క్రమబద్ధీకరిస్తే తప్ప పట్టాలు ఇవ్వడానికి కాని, కనీస సదుపాయాల కల్పనకు కాని అవకాశం ఉండదన్నారు.

పది గ్రామాల్లో బోర్లు ఏర్పాటు

పద్మనాభం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పది గ్రామాల్లో జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్. గిరిబాబు రూ.15 లక్షల జడ్పీటీసీ నిధులతో తాగునీటి బోర్లు వేయించారు. మంచినీటి సౌకర్యం అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఆయా గ్రామాల్లో బోర్లు వేయించారు. పద్మనాభంలో ఏర్పాటు చేసిన బోరును ఎంపీపీ కె. రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కె. ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో కార్మికులదే కీలక పాత్ర

సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీసీ అభివృద్ధిలో కార్మికులదే కీలక భూమిక అని ఆ సంస్థ విశాఖ రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు అన్నారు. సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆదర్శ కార్మికుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. గిరి ప్రదక్షిణలో షెటిల్ సర్వీసులుగా 55 బస్సులను, ఇతర ప్రాంతాల నుంచి 150 బస్సులను నడిపామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, ఏఈ సుధారాణి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఫ్‌ఆర్, మిలాన్ నిర్వహణపై సమీక్ష

... 5వ పేజీ తరువాయి

శాఖలు, విభాగాల అధిపతులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఈ సమావేశంలో నేవీ, విమానాశ్రయం, విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పోలీస్, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. నేవల్ ఆఫీస్ ఇన్‌చార్జి రజనీశ్‌శర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, నేవీ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తాం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి ఆగిపోతుందని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎన్నికలకు ముందు తప్పుడు ప్రచారం చేశారని, కానీ అందుకు భిన్నంగా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన తగరపువలస బాలాజీనగర్ సమీపంలో పాచిపేట ప్రాంతంలో రూ. 57 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. సాధారణ పింఛన్లను మూడు వేల రూపాయల నుంచి నాలుగు వేలకు పెంచడంతో పాటు ఇంట్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం కింద లబ్ధి చేకూర్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వం 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా తమ ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వందనం అందించిందని తెలిపారు. పాచిపేట రోడ్డు నిర్మాణానికి ఎన్ని అవరోధాలు వచ్చినా, పని జరిగి తీరుతుందని చెప్పారు. స్థానికుల కోరిన మేరకు కొత్తగా రేషన్ డిపో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాల అక్రమాలపై కొంతమంది ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, తహసీల్దార్ రామారావు, టీడీపీ నాయకులు రమేశ్, సూరిబాబు, రామారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో గిరి ప్రదక్షిణ విజయవంతం

సింహాచలం దేవస్థానం ఈఓ త్రినాథరావు



అధికారులను సత్కరించిన దేవస్థానం ఈఓ త్రినాథరావు, సిబ్బంది

సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రదక్షిణ నగర ప్రజలందరి సహకారంతో విజయవంతమైందని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలెక్టరేట్‌లో కలిసి శాలువతో సత్కరించారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఆలయ వేద పండితులు అధికారులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రాథమిక అంచనా ప్రకారం గిరి ప్రదక్షిణలో రెండు రోజుల్లో సుమారు ఎనిమిది లక్షల మంది పాల్గొనగా, అప్పన్నను 1.10 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. జీవీఎంసీ, పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో దేవస్థానం అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ముందస్తు ప్రణాళికలతో పని చేయడం వల్ల ఉత్సవం విజయవంతమైందని చెప్పారు. ఉత్సవంలో భాగస్వాములైన వారందరికీ దేవస్థానం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ వెంకట రమణ, డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి), తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు'

తగరపువలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్టు మీటర్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ అన్నారు. శుక్రవారం స్థానిక జీఆర్ భవన్‌లో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఇళ్లకు స్మార్టు మీటర్ల వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్మార్టు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించారని, ఇప్పుడు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు.

జోన్-3 ఈఈగా సింహాచలంనాయుడు



సింహాచలంనాయుడిని అభినందిస్తున్న అధికారులు

మధురవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ జోన్-3 (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బి. సింహాచలంనాయుడు శుక్రవారం మధురవాడ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సంస్థ అంతర్గత బదిలీల్లో భాగంగా ఇక్కడ ఈఈగా పనిచేసిన పోలాకి శ్రీనివాసరావు జోన్-1కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సింహాచలంనాయుడు వచ్చారు. నూతన ఈఈకి డీఈలు కిరణ్‌కుమార్, రమేష్, రాజశేఖర్, రామునాయుడు, కోటేశ్వరరావు, సుమన్,గాయత్రీ, జ్యోతి, ఉదయ్ కిరణ్ అభినందనలు తెలిపారు.

సామరస్యంతో కేసులు రాజీ

మహారాణిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సామరస్యంతో కేసులను రాజీ చేసుకుంటే మంచిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. శుక్రవారం జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాలను 90 రోజుల ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో సింహవల్లీ తాయార్, సువర్ణ అమ్మవార్ల తిరువీధి వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. పండితుల పారాయణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ తిరువీధి జరిపారు.

దివాన్‌జీ కాలువకు సాగునీరు విడుదల



కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

పద్మనాభం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మద్ది గోస్తనీ నదిపై ఉన్న ఆనకట్ట ద్వారా దివాన్‌జీ కాలువకు సాగునీటి సంఘం అధ్యక్షుడు రాజాసాగి రవికుమార్ రాజు శుక్రవారం నీరు విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా చిరత చెరువు, తాటితూరు చెరువులోకి నీరు చేరి పాండ్రంగి పంచాయతీలోని ఏడు గ్రామాలకు, భీమిలిలోని తాటితూరు, ఆనందపురంలోని గొట్టిపల్లి గ్రామాలకు చెందిన 1100 ఎకరాలకు నీరు అందుతుంది. కార్యక్రమంలో కాలువ డైరెక్టర్లు పిన్నింటి రమణ, కర్రోతు వెంకటరమణ, కన్నయ్య, గొట్టిపల్లి మాజీ సర్పంచ్ కె. వెంకట నర్సింహనాయుడు, వార్డు సభ్యుడు మహంతి అప్పలరమణ, కూటమి నాయకులు పాపారావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు జీ టెక్ సహకారం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజాఫణిపప్పు

సాగర్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) అవసరమైన సాంకేతిక సహకారం అందించడానికి గీతం టెక్నాలజి ఎనేబిలింగ్ సెంటర్ (జి టెక్) సిద్ధంగా ఉందని ఆ వర్సిటీ జీ టెక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు తెలిపారు. ఎంఎస్ఎంఈ కనెక్ట్ 2025 పేరిట నగరంలోని ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల అవసరాలను వారికి అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం గీతంలో జీటెక్ పేరిట ప్రత్యేక విభాగం నెలకొల్పిందని వెల్లడించారు. జీటెక్ ద్వారా ఆహార శుద్ధి పరిశ్రమలకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసి మిజోరాం,లడఖ్ ప్రాంతాల్లోని రైతులకు అందించామని, గెయిల్ తదితర పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హరిప్రసాద్, డీఎస్‌టీ సభ్యుడు పి. రవికుమార్, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మాజీ సలహాదారు డాక్టర్ యోగేశ్వరరావు, ఎన్ఐఓ శాస్త్రవేత్త డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ, గీతం విశిష్ట ప్రొఫెసర్ గురజాడ రవికుమార్, అరవిందో ఫార్మా సీనియర్ జనరల్ మేనేజర్ ఇ. సంపత్‌రెడ్డి, జీ టెక్ నిపుణులు సోంభట్టు శాస్త్రి, డాక్టర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం



విజేతలతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు

భీమునిపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 20 పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. డ్రాయింగ్‌లో బి. ధనుష్, కె. వినీలా, ఇ. లలిత, వ్యాసరచనలో కార్తీక్, భాగ్యశ్రీ, ఎస్. వివంజలిన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ బహుమతి కింద రూ. 1250, ద్వితీయ స్థానానికి రూ. 1000, తృతీయ స్థానానికి రూ. 750 అందించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ర్థ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ మాట్లాడుతూ జనాభా పెరుగుదల పర్యావరణం, విద్య, ఉద్యోగాలు, వనరులపై ప్రభావితం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూఆక్రమణకు పాల్పడిన ముగ్గురి అరెస్టు

కొమ్మాది, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్రాలతో భూ కబ్జాకు పాల్పడిన ముగ్గురిని పీఎంపాలెం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు తెలిపిన వివరాలు ప్రకారం..ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి చెందిన ఆర్‌ఎస్ఎస్ ప్రకాశరావు 1983లో రేవళ్లపాలెం వద్ద ఉన్న బ్యాంకు ఆఫీసర్స్ హౌసింగ్ కాలనీలో 300 గజాల స్థలం కొనుగోలు చేశారు. లేఅవుట్‌లో చాలామంది ఇళ్లు నిర్మించుకోగా 1 నుంచి 5వ నంబరు వరకు ఉన్న ప్లాట్లు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. వీటిలో ప్రకాశరావు ఒక్కరే భారత్‌లో ఉండగా మిగిలిన ప్లాట్ల యజమానులు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉంటున్నారు. ఖాళీగా ఉన్న ఈ ప్లాట్‌లపై రేవళ్లపాలెం గ్రామానికి చెందిన బెవర అనిల్‌కుమార్, బెవర వెంకటేష్‌తో పాటు శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం లక్ష్మీపురంనకు చెందిన పాగోటి దిలీప్‌కుమార్ కన్ను పడింది. తమ తాతలు అమ్మిన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి ఆయా ప్లాట్లకు సంబంధించిన సర్వే నంబర్లతో సుమారు 1300గజాల స్థలాన్ని కాకినాడకు చెందిన రామ పద్మజ పేరున అనకాపల్లి జిల్లా కె. కోటపాడు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. ఈమేరకు గతనెల 28న అర్ధరాత్రి ఆ ముగ్గురు మరికొంతమందిని వెంట పెట్టుకుని జేసీబీ, లారీలతో వచ్చి ప్లాట్లను చదును చేసి స్వాధీనం చేసుకునే ఎత్తుగడ వేశారు. విషయం తెలిసిన ప్రకాశరావు ఆ స్థలం తమదని నిలదీయడంతో కబ్జాదారులు ఆయన్ను భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ఆయన పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. ఆ ముగ్గురు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి భూఆక్రమణకు పాల్పడినట్టు గుర్తించారు. అలాగే 2019, 2025లో మరో రెండు భూ ఆక్రమణల కేసులో కూడా వారి పాత్ర ఉన్నట్టు పోలీసుల వద్ద సమాచారం ఉంది. దిలీప్‌కుమార్ శ్రీకాకుళం జిల్లాలో పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్టు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు సీఐ బాలకృష్ణ, ఎస్ఐ రాము, కె. భాస్కర్ ఉన్నారు.



ఇన్‌ఆర్బిట్ మాల్‌లో స్క్రీన్ నిర్మాణానికి పూజ చేస్తున్న అల్లు అరవింద్, చిత్రంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

ఇన్‌ఆర్బిట్ మాల్‌లో అల్లు అర్జున్ సినిమా థియేటర్లు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆసుపత్రి దగ్గర నిర్మిస్తున్న ఇన్‌ఆర్బిట్ మాల్‌లో ఏర్పాటు చేయనున్న సినిమా స్క్రీన్‌కు ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పూజలు చేశారు. ఏషియన్ అల్లు అర్జున్ (ఏఏఏ) సినిమా పేరిట మాల్‌లో 8 స్క్రీన్‌లు అరవింద్ తీసుకున్నారు. ఇన్‌ఆర్బిట్‌మాల్ స్ట్రక్చర్ నిర్మాణం ఓ కొలిక్కి రావడంతో టాప్ ఫ్లోర్‌లో అరవింద్ పూజా కార్యక్రమాలతో తదుపరి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సందీప్, గీతా ఆర్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేషన్‌లో ఎండ్ ప్లాట్‌ఫారం

... 5వ పేజీ తరువాయి

శిక్షణ ఇచ్చామన్నారు. కొండ ప్రాంతాల్లో పనిచేసే వారికి జీపీఎస్ పరికరాలు ఇస్తామన్నారు. వారికి ఎక్కడైనా ట్రాక్ ప్రమాదకరంగా ఉన్నట్టు కనిపిస్తే ఆ పరికరం ద్వారా తమ ఉన్నతాధికారికి తెలియజేస్తారని, సాయం అవసరమైతే రెండో బటన్ నొక్కి ఇతర పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇస్తారని, రైళ్ల రాకపోకలు ఆపేయాల్సిన పరిస్థితి ఉన్నట్టయితే మూడో బటన్ నొక్కి రెండు వైపులా స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేస్తారన్నారు. ఆ విధంగా జీపీఎస్‌లను రూపొందించామన్నారు. వీటి వల్ల ప్రమాదాలు తగ్గుతాయని డీఆర్ఎం అభిప్రాయపడ్డారు.

రైళ్ల వేగం 130 నుంచి 160 కి.మీ.

విశాఖపట్నం నుంచి దువ్వాడ మీదుగా పలాస వరకు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ (ప్రహరీ గోడలు) నిర్మిస్తున్నామని, దీనివల్ల పశువులు, గొర్రెలు వంటివి ట్రాక్‌పైకి రాకుండా ఉంటాయన్నారు. దీంతో ఆ లైన్‌లో ప్రస్తుతం 130 కి.మీ. వేగంతో నడుస్తున్న రైళ్లను 160 కి.మీ. వేగంతో నడిపే అవకాశం కలుగుతుందన్నారు.

జీఎం కార్యాలయం కోసం రెండు, మూడు భవనాల పరిశీలన

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణం ముడసర్లోవలో జరుగుతున్నదని, జనరల్ మేనేజర్ కోసం రెండు, మూడు భవనాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. సిరిపురం వీఎంఆర్‌డీఏకు చెందిన ది డెక్‌లో ఒక అంతస్థు అడిగామన్నారు. అలాగే స్టేషన్‌కు సమీపంలో నిర్మించిన గతి శక్తి భవనాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత

విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించేశామని, అవి ఇకపై వాయువేగంతో జరుగుతాయన్నారు. అనుకున్న గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు.

జడ్పీ ఛైర్‌పర్సన్‌పై అసంతృప్తి గళం

... 5వ పేజీ తరువాయి

కొంతమంది చెప్పారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకుంటారేమోనని నాలుగైదు నెలలుగా వేచి చూస్తున్నామని, కానీ ఎవరూ కనీసం పట్టించుకోలేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ దశలో ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జోక్యం చేసుకుని ఛైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఎంతమంది, వ్యతిరేకంగా ఎంతమంది ఉన్నారో తేలాలంటే చేతులెత్తే పద్ధతిని పాటించవచ్చునని, లేనిపక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సమావేశమై ఒక నిర్ణయానికి రావచ్చునని అన్నారు.దీంతో సభ్యులను బయటకు పంపి నాయకులు చర్చించుకున్నారు. ఆ తరువాత అందరినీ లోపలకు రప్పించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నానని, అధినేత జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అంతవరకూ సంయమనం పాటించాలన్నారు. దీంతో కొందరు సభ్యులు లేచి వారం, పది రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లాలని అడగ్గా...నెల తరువాత తీసుకువెళతానన్నారు. అయితే జడ్పీ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్న సభ్యుల డిమాండ్‌కు నేతలు అంగీకరించలేదు. మరో ఏడాదిలో జడ్పీ కాలపరిమితి ముగుస్తోందని, అప్పటివరకూ అందరూ కలిసి వెళ్లాలని సూచించారు. సభ్యులంతా మాట్లాడినప్పటికీ ఛైర్‌పర్సన్ మాత్రం మౌనంగా ఉన్నారు.జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ పదవి ఇస్తామన్న హామీతోనే అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానని గుర్తుచేస్తూ తనకు అన్యాయం జరిగిందన్నారు. ఈ దశలో బొత్స జోక్యం చేసుకుని అధినేతను కలిసి సమస్య విన్నవించుకోవాలన్నారు. ఇదిలావుండగా పార్టీ నేతల వద్ద ఏర్పాటుచేసిన పంచాయితీలో ఏమీ తేలకపోవడంపై పలువురు సభ్యులు బయటకు వచ్చి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాల్సిందేనని కొందరు అన్నారు.

విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యాయి. వీటిలో ఇప్పటివరకూ 58,274 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదుచేసుకోగా, మొక్కల పెంపకానికి 56,395 మంది ముందుకువచ్చారు. ఒక్కొక్క విద్యార్థి ఒకటి నుంచి మూడు మొక్కలు తీసుకునేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు జిల్లాలో 89,040 మొక్కలు తీసుకునేందుకు విద్యార్థులు తమ పేర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద నమోదుచేసుకున్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్‌వరకు చదివే విద్యార్థులను గ్రీన్‌పాస్‌పోర్టులో నమోదుచేసి వారికి మొక్కలు అందజేస్తారు. సామాజిక అటవీ విభాగం నర్సరీల నుంచి శుక్రవారం వరకు జిల్లాలో పాఠశాలలకు 50,309 మొక్కలు చేరాయి. రవాణా ఖర్చులు పాఠశాలలు భరించాయి. విద్యార్థులకు సీమబాదం, ఎర్రచందనం, దేవకాంచనం, అంకుడు, గానుగు, తురాయి, మహాగని, మామిడి తదితర జాతులకు చెందిన మొక్కలు అందజేశామని జిల్లా అటవీ శాఖాధికారి జి.మంగమ్మ తెలిపారు. కాగా విద్యార్థులకు మొక్కల పంపిణీ నుంచి వాటిని నాటడం, పెంపకంపై ఉపాధ్యాయులు సూచనలు ఇస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత నెలకొంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని విద్యార్థులకు వివరించామన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది ద్వారా చేయిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి 28 వరకూ పరిశీలన చేసి తుది జాబితా తయారుచేయడం జరుగుతుందన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. రూట్స్ యాప్ ద్వారా వివరాలను సేకరించి, ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి దిగ్విజయం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలనుపైకి తీసుకురావడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి విషయంలో బంగారు కుటుంబాలకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారన్నారు. సమీక్ష సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పీవీజీఆర్ నాయుడు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితాలు

... 5వ పేజీ తరువాయి

13వ తేదీలోగా అర్జి పెట్టుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు ఆన్‌లైన్‌లో పరిశీలించి జాబితాలో పేరు లేకపోతే కారణాలు తెలుసుకుని వెంటనే సవరణ చేసి తహశీల్దారుకు పంపుతారన్నారు. ఇంకా మనమిత్రకు వాట్సాప్ ద్వారా 9552300009కు లేదా కాల్‌సెంటర్ నంబరు 155251కు కాల్ చేయాలని సూచించారు.

పరిశోధనల నాణ్యతలో రాజీ పడవద్దు

» నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి
» ఏయూ వీసీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాలకు చెందిన నిపుణులతో విశ్వవిద్యాలయ విద్యార్థులను అనుసంధానం చేసే శతాబ్ధివాణి కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అకడమిక్ సెనేట్ మందిరంలో ఈ కార్యక్రమాలను ఉపకులపతి జీపీ రాజశేఖర్ ప్రారంభించారు.

అనంతరం జియో ఫిజిక్స్ విభాగంలో పరిశోధకులకు ఉద్దేశించి 'ద ఆర్ట్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్' అనే అంశంపై ప్రత్యేక ప్రసంగంలో వీసీ మాట్లాడుతూ పరిశోధనల్లో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకునే విధానం, పరిశోధన జరపడానికి అవసరమైన అంశాలు, పరిశోధన జరిపే విధానం, నాణ్యమైన పరిశోధనలు జరపడానికి అవసరమైన సూచనలు అందజేశారు. పరిశోధకులు స్వీయ ప్రేరణతో ముందుకు సాగాలని సూచించారు. అదే సమయంలో తమ ఆలోచనలను ధైర్యంగా, స్వేచ్ఛగా ఇతరులతో పంచుకోవాలన్నారు. జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొనడం, తమ పరిశోధనకు సంబంధించిన అంశాలపై ప్రసంగించడం, నిపుణుల సూచనలు, ఆలోచనలను స్వీకరించడం అలవాటు చేసుకోవాలన్నారు.

ప్రధాన అంశాలైన లిటరేచర్ రివ్యూ, రీసెర్చ్ టూల్స్, మెథడాలజీ, అనాలసిస్, టెక్నికల్ రైటింగ్, సరైన జర్నల్స్‌ను ఎంపిక చేసుకోవడం, రీసెర్చ్ ప్రపోజల్ రచన తదితర అంశాలను విపులంగా వివరించారు. సమాచారాన్ని పొందడానికి ఉపయుక్తంగా నిలిచే పుస్తకాలు, జర్నల్స్, పరిశోధన గ్రంథాలు, ఈ-రిసోర్సెస్, ఇంటర్నెట్ సమాచారం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పరిశోధనలో భాగంగా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించే విధానాలు, పరిశోధనా గ్రంథరచనలో వీటిని వివరించే పద్ధతులను సోదాహరణంగా తెలియజేశారు. సరళంగా, సులభంగా, ఆసక్తిదాయకంగా పరిశోధన గ్రంథ రచన చేసే విధానాన్ని పరిశోధకులకు తెలిపారు. పరిశోధనకు అవసరమైన అంశాన్ని ఏ విధంగా గుర్తించాలి, గతంలో జరిగిన పరిశోధనలు, అధ్యయనం చేయడం వర్తమాన అవసరాలకు అనుగుణంగా సమస్యను గుర్తించి దానికి పరిష్కారాలను చూపించాల్సి విధానాన్ని వివరిస్తూ.. ఈ ప్రక్రియలో పరిశోధకులు అనుసరించాల్సిన ఆలోచన సరళిని విపులంగా తెలియజేశారు. పరిశోధన లక్ష్యాలను వివరించడం ఎంతో ప్రధానమని చెప్పారు. పరిశోధన జరిపే ప్రక్రియలో ఎవరి భాగస్వామ్యం స్వీకరించాలి, అత్యుత్తమైన జర్నల్ ఎంపిక చేసుకోవడం, వాటిలో పరిశోధనా పత్రాలను ప్రచురించడం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి మార్గాలను సైతం సూచించారు.

శతాబ్ధివాణి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీన్ ఔట్రీచ్ కె.రమాసుధ మాట్లాడుతూ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాల నిపుణులను విశ్వవిద్యాలయానికి ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు.ఈ నెల 17న శతాబ్ది వాణిలో రెండో ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో ఔట్రీచ్ అసోసియేట్ డీన్ వెంకటరావు, ప్రిన్సిపాల్ గిరిజాశంకర్, ఆచార్యులు పద్మశ్రీ, సీతామాణిక్యం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనంద గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, ఖాళీ స్థలాల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు


» జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ అధికారులకు మేయర్ పీలా ఆదేశం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలోని జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో చాలా వరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని నియంత్రణించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ఎన్ని పార్కులు, ఖాళీ స్థలాలు ఉన్నాయి, ఆక్రమణకు గురైనవి, అభివృద్ధి చేసిన పార్కులు, పరస్పర బదలాయింపు ద్వారా మార్పిడి చేసిన స్థలాలు, పార్కులు తదితర వివరాలతో పూర్తి నివేదిక సోమవారం నాటికి ప్రభుత్వ జీవోలతో సహా అందించాలన్నారు. ఖాళీ స్థలాలు, పార్కులపై తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేయర్ అధికారులను హెచ్చరించారు. పార్కులు, ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతానని తెలిపారు. సమావేశంలో సీసీపీ ఎ.ప్రభాకర్, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ మీనా కుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్లు ధనుంజయరెడ్డి, హరిదాస్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి సూచనలు చేస్తాం

» లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మదింపు చేసి వాటి పనితీరు మెరుగుపర్చేందుకు ప్రభుత్వానికి సూచనలు చేయనున్నట్టు ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉత్తరాంధ్రలోని ప్రభుత్వ రంగ సంస్థల అధికారులతో కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు తమ అకౌంట్లు, ఆడిట్‌పై పూర్తిస్థాయి సమాచారంతో కూడిన నివేదికలు అందజేసినప్పుడే తాము ప్రభుత్వానికి సరైన నివేదికలు సమర్పించగలమన్నారు. కాగా జీవీఎంసీ పరిధిలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలు, చేపట్టిన ప్రాజెక్టులను కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. వీఎంఆర్‌డీఏ చేపడుతున్న కార్యకలాపాలపై జాయింట్ కమిషనర్ రమేష్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిపై కమిటీ చైర్మన్ స్పందిస్తూ విశాఖ నగరాభివృద్ధి సంస్థకు సంబంధించి న్యాయ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేకంగా జ్యుడీషియల్ ప్యానల్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఏపీఐఐసీ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములు సద్వినియోగం అయ్యేలా, పరిశ్రమలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పనితీరుపై కమిషనర్ ప్రసాదరావు వివరించారు. పర్యాటక ప్రాజెక్టుల గురించి ప్రాంతీయ పర్యాటక డైరెక్టర్ జగదీష్ వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సి.ఐజాక్‌బాషా, నడికుదిటి ఈశ్వరరావు, ఆర్వీఎస్‌కేకే రంగారావు, గిడ్డి సత్యనారాయణ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, శాసనసభా కమిటీ సంయుక్త కార్యదర్శి పీవీ సుబ్బారెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, ఏపీఐఐసీ జడ్ఎం సింహాచలం, వీఎంఆర్డీఏ ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పర్యాటకాధికారులు నారాయణరావు, కుమారస్వామి, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ


రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని 125 మంది రిసోర్స్ పర్సన్లకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతులమీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరులోని వుడా కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డిజిటల్ పద్ధతుల్లో పని చేయడం వల్ల పని సామర్థ్యం పెరగడంతో పాటు, సామాజిక సంక్షేమ పథకాల అమలు సక్రమంగా, వేగంగా జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్పొరేటర్లు గొలగాని మంగవేణిపోలారావు, పీతల మూర్తియాదవ్, అధికారులు పాల్గొన్నారు.

యథాస్థానంలోనే భూలోకమాత అమ్మవారి ఆలయం

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు ఆలయ కమిటీ విన్నపం


వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మద్దిలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో సీఎంఆర్ సెంట్రల్ పక్కన ఉన్న శ్రీభూలోకమాత అమ్మవారి ఆలయానికి ఎటువంటి ఆటంకం కలిగించవద్దని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. విశిష్ట చరిత్ర కలిగిన అమ్మవారి గుడి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఆలయాన్ని యథాస్థానంలో ఉండేవిధంగా చర్యలు చేపట్టి భక్తుల మనోభావాలను గౌరవించాలన్నారు. అలాగే ఆలయం ఎదురుగా మూడు లైన్లతో రహదారులు ఉన్నందున ఉత్సవాల్లో సమయంలో సమస్యలు వస్తున్నాయన్నారు. మూడు రోడ్లను రెండు రహదారులుగా మార్పు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు.

దీనికి స్పందించిన ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూలోకమాతా అమ్మవారి ఆలయాన్ని యథాస్థానంలో ఉండేవిధంగా ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లానన్నారు. బీఆర్‌టీఎస్ ప్రణాళికలో ఉన్న మూడు రహదారులను రెండు రహదారులుగా మార్పు చేయడం తమ పరిధిలో లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బేరి గురునాథరెడ్డి, కార్యదర్శి అప్పలస్వామి రెడ్డి, కార్పొరేటర్ పద్మారెడ్డి, టీడీపీ నాయకులు బర్ల బాలకృష్ణ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గ అమ్మవారు


కూరగాయలతో అలంకరించిన అమ్మవారు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సంజీవ్ గాంధీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆషాఢమాసం పురస్కరించుకుని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక అలంకరణలో భాగంగా వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శర్మ భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, సూర్యనారాయణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య పరిశ్రమకు పెరిగిన ప్రాధాన్యం

» జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడు ఎం.గురునాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న గురునాథరావు

బీచ్ రోడ్డు, జూలై 11, (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య పరిశ్రమ కీలకంగా మారిందని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడు ఎం. గురునాథరావు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మత్స్యశాఖ సహకార శాఖ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ ఇయర్ ఆఫ్ కో-ఆపరేటివ్-2025ను పురస్కరించుకొని ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పలు రకాల పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూనే అభివృద్ధిపై దృష్టి సారిస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మత్స్య పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని, దేశంలో ఏర్పాటయ్యే మత్స్య పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలను స్థాపించేవారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. మత్స్యకారుల అభివృద్ధిలో మత్స్య పారిశ్రామిక సంఘాల పాత్ర సంఘాల నిర్వహణ, ఆడిట్ సంఘాల అభివృద్ధికి ప్రణాళికపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ప్రవీణ, జిల్లా మత్స్య సంఘం ఉపాధ్యక్షుడు ఆడిబాబు, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి ధనుంజయరావు, మత్స్య శాఖ ఎ.డి. విజయ్‌కృష్ణ, మత్స్య శాఖ అధికారి ఆశాజ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతరంతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు

» ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసుల నాయుడు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ యువత దేశభవితకు అండగా నిలుస్తారని శాసన మండలి సభ్యుడు గాదె శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం విలువైన మానవ వనరులుగా నిలవాలని సూచించారు. కళాశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయిస్తూ సమాజ సమస్యలకు పరిష్కారాలను చూపాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, ఎల్లప్పుడూ ఆ దిశగా కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టి విద్యార్థులుగా తామంతా సమాజంలో ప్రధానంగా చిన్నారులలో సత్ప్రవర్తన, మానవత్వం పెంపొందించే దిశగా పనిచేయాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటామని, దీని ద్వారా ప్రజలలో జనాభా వృద్ధిపట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. భారతదేశ జనాభాను ముఖ్యంగా యువతను సమాజ ఉపయుక్తంగా తీర్చిదిద్దవలసిన ఆవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టే నేటి తరం విద్యార్థులు భవిష్యత్ సవాళ్లను స్వీకరించడానికి, వాటికి అనువైన పరిష్కారాలను చూపడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు అన్నవరపు చంద్రమోహన్ జనాభా అభివృద్ధి, పర్యవసానాలు, పరిష్కారాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి, డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ : ఏయూ వీసీ


మొక్కలు నాటుతున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏయూ నార్త్ క్యాంపస్‌లోని అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహాల ప్రాంగణంలో విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏయూ హార్టీ కల్చర్ గార్డెనింగ్ విభాగం ప్రత్యేకంగా వివిధ పండ్ల జాతులు మొక్కలను, దీర్ఘకాలం జీవించే మొక్కలను ఇక్కడ నాటారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలను అందించిన వీసీటీపీఎల్ అధికారులకు వీసీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వీసీటీపీఎల్ ప్రతినిధులు టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీ, వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్-అడ్మిన్ ఎంఎస్ రావు, పీఅర్-సెక్యూరిటీ విభాగం సీనియర్ జనరల్ మేనేజర్ జిత, ఆపరేషన్ విభాగం హెడ్ మధు, రిక్రూట్మెంట్ హెడ్ కుమార్, ధనుంజయ్, ఏయూ హార్టీ కల్చరల్ విభాగం డీన్ ఎస్పీ పడాల్, అకడమిక్ డీన్ శ్రీనివాసరావు వృక్షశాస్త్ర విభాగాధిపతి సంధ్యా దీపిక, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య యుగంధర్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైదానంలో మామిడి, సపోటా, సీతాఫలం, నేరేడు, బాదం, మహాగని వంటి మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చుట్టూ రక్షణ కంచెను సైతం ఏర్పాటు చేశారు.

'జాప్' నగర శాఖ నూతన కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) విశాఖ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంవీపీ కాలనీ గిరిజన్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా కేఎం కీర్తన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా జేవీకే అప్పలరాజు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను జాప్ వ్యవస్థాపకుడు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రవితేజ, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఎన్‌యుజె కార్యదర్శి శశి పర్యవేక్షించారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా నిర్వహించిన ఈ ఫోరమ్‌లో జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు ఫిర్యాదులను స్వీకరించారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు తదితర వాటిని ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చని ప్రభాకరరావు తెలిపారు.

కృష్ణా కళాశాలలో జనాభా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌బాబు

మద్దిలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విద్యావంతులు, ఆరోగ్యవంతులైన జనాభా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జనాభా సమస్యలపై అవగాహన కల్పించేందుకు, పర్యావరణ అభివృద్ధికి ప్రతి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించాలని 1990లో ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసిందన్నారు. అప్పటి నుంచి జనాభా సమస్యల ఆవశ్యకత, ప్రాముఖ్యతపై దృష్టి కేంద్రీకరించడానికి జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించిన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కె.రవిబాబు, అర్థశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ లక్ష్మి, పోల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువ జాతీయ అధికార ప్రతినిధిగా శ్రీనివాస్ వర్మ



పెదవాల్తేరు, జూలై 11 : (ఆంధ్రజ్యోతి) అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువ జాతీయ అధికార ప్రతినిధిగా బీజేపీ సీనియర్ నాయకుడు దాట్ల శ్రీనివాస్ వర్మ నియమితులయ్యారు. అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువ జాతీయ అధ్యక్షుడు కున్వర్ అవినేష్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. దాట్ల శ్రీనివాస్ వర్మ ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన బాధ్యతలు నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు.

కర్ణాటక సంగీత కళాకారిణి జలజాక్షికి గురు సత్కారం



రామ్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్రస్వామి మఠంలో వ్యాస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు, ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో గురు సత్కారం పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిష్యబృందం భక్తితో గురు వందనాన్ని సమర్పించారు అనంతరం ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.జలజాక్షిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మఠం చైర్మన్ ఎ.వెంకటరావు. ప్రతినిధులు కె.సుబ్రహ్మణ్యం, జగన్‌మోహనరావు, ఎం. మదుబాబు తదితరులతో పాటు పలువురు సంగీత కళాకారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 31, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 48, దొండకాయలు 42, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 78, గోరుచిక్కుడు 38, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

బ్రాయిలర్	
బ్యాగ్	
రైతుధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

జనాభా వృద్ధి పర్యవసానాలను అర్థం చేసుకోవాలి

» ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (ఐఎస్ఐ) పూర్వాచార్యులు టీజే రావు



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్, వేదికపై టీజేరావు, ఇతర ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఏర్పడే పర్యవసానాలను అర్థం చేసుకోవాలని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) పూర్వాచార్యులు టీజే రావు అన్నారు. ఏయూ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా స్టాటిస్టిక్ విభాగంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ జనాభా దినోత్సవం వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజే రావు మాట్లాడుతూ జనాభా అధ్యయనం గణాంకాలను సిద్ధం చేసే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. జనాభాకి అనుగుణంగా సమాన అవకాశాలు కల్పించడం, సమాజంలో సమానత్వాన్ని స్థాపించడం ఎంతో ప్రధానమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేసే దిశగా యువతరం కృషి చేయాలన్నారు శతాబ్ధి సంవత్సరంలో ఏయూలో విద్యను అభ్యసిస్తున్న యువతను ఈ సందర్భంగా అభినందించారు. జపాన్‌లో జనాభా వృద్ధి తగ్గిపోవడం, వృద్ధుల జనాభా పెరగడం వలన ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేశారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ పర్యావరణహిత జీవనంపై దృష్టి సారించాలని సూచించారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ జనాభా అభివృద్ధి జరిగే సమయంలో తగిన పోషకాహారం, సరైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటివి చేయాలన్నారు. జనాభా అధ్యయన కేంద్రం సంచాలకులు బి.మునిస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 జనాభా అధ్యయన కేంద్రాలు సేవలను అందిస్తున్నాయని, 1977 నుంచి ఏయూలో ఈ కేంద్రం సేవలను అందిస్తున్న విధానాన్ని వివరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

ఇన్‌ఆర్బిట్‌మాల్‌లో అల్లు అర్జున్ సినిమా థియేటర్లు



ఇనార్బిట్‌మాల్‌లో స్ర్కీన్ నిర్మాణానికి పూజ చేస్తున్న అల్లు అరవింద్, చిత్రంలో భీమిలి ఎమ్మెల్యే గంటా తదితరులు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి దగ్గర నిర్మిస్తున్న ఇన్‌ఆర్బిట్ మాల్‌లో ఏర్పాటు చేయనున్న సినిమా స్ర్కీన్‌కు ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పూజలు చేశారు. ఏషియన్ అల్లు అర్జున్ (ఏఏఏ) సినిమా పేరిట మాల్‌లో 8 స్ర్కీన్‌లు అరవింద్ తీసుకున్నారు. ఇన్‌ఆర్బిట్‌మాల్ స్ట్రక్చర్ నిర్మాణం ఓ కొలిక్కి రావడంతో టాప్ ఫ్లోర్‌లో అరవింద్ పూజా కార్యక్రమాలతో తదుపరి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. విశాఖ పరిసరాల్లో టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్, సత్వా, ఏఎన్ఎస్ఆర్ తదితర ఐటీ సంస్థలతో పాటు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు కూడా ఊపందుకోనున్న నేపథ్యంలో మాల్స్‌కు డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పి.సందీప్, గీతా ఆర్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఓపెన్ జిమ్ పరికరాలు బహూకరణ

అక్కయ్యపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి ప్రతినిధులు శుక్రవారం ఓపెన్ జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు టి. సత్యశ్రీ లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం ఎంతో అవసరమని అన్నారు. ఈ సదర్భంగా వ్యాయమ ఉపాధ్యాయురాలు రత్నం కోరిక మేరకు తమ వంతు సాయంగా పాఠశాలకు ఓపెన్‌జిమ్ పరికరాలను అందించినట్టు చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయురాలు జయంతి రాధా మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రతినిధులు అందించిన జిమ్ పరికరాలను విద్యార్థులకు ఎంతో ఉపయోగపడటాయని ఆనందం వ్యక్తం చేశారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

అక్కయ్యపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 46వ వార్డులో ప్రజలకు సేవలందించి వేరే ప్రాంతాలకు ఉద్యోగ రీత్యా బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజల కోసం సేవలందించే సచివాలయం సిబ్బంది బదిలీపై మరో చోటికి వెళ్ళడంతో బాధాకరంగా ఉందన్నారు.

సామరస్యంతో కేసులు రాజీ చేసుకోవాలి

మహారాణిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సామరస్యంతో కేసులను రాజీ చేసుకుంటే మంచిదని శుక్రవారం నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి చిన్నం శెట్టి రాజు అన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాలను 90 రోజుల ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలు

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పౌరగ్రంథాలయంలో పోటీపరీక్షలకు చదువుతు న్న ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలను శుక్రవార ం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తమాన అంశాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, భారత ఆర్థిక వ్యవస్థ, భౌగో ళ శాస్త్రం తదితర అంశాలపై క్విజ్ పోటీను నిర్వహించారు. ఈ పోటీలో 50 మంది సభ్యు లు ఆరు బృందాలుగా పాల్గొన్నారు. క్విజ్ మాస్టర్‌గా డాక్టర్ డీవీ.సూర్యరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వతో డెంగ్యూ, మలేరియా వ్యాప్తి

» జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు

అల్లిపురం, జులై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జోన్- 4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. జీవీఎంసీ 34వ వార్డులో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డెంగ్యు, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి చేందకుండా మనల్ని మనమే కాపాడుకోవాలని అన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్ వైద్యాధికారి కృష్ణంరాజు, మలేరియా విభాగ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జీవో 77 రద్దు చేస్తామన్న హామినీ వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాగరాజు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌రేట్‌ను ముట్టడించి ఆందోళన చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే జీవో 77 ను రద్దు చేస్తామని యువగళం యాత్రలో నారా లోకేశ్ హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కోర్సు పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లు కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో 3900 కోట్లు విడుదనల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విద్యార్థులకు అందలేదని తెలిపారు. అలాగే డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్ విధానం ద్వారా కొనసాగించాలని కోరారు. వీలైనంత త్వరగా తమ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో యోగా ట్రైనర్ల పోస్టులను పునరుద్ధరించండి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న యోగా ఇన్‌స్ట్రక్టర్ అసోసియేషన్ సభ్యులు

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 1056 మంది యోగ ట్రైనర్‌లను కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో పునరుద్ధరణ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగ ఇన్‌స్ట్రక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ 2022 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా యోగా ట్రైనర్‌ను నియమించారని, ఆరు నెలలు రూ.16 వేల జీతం ఇచ్చారని, ఆ తరువాత విధుల నుంచి తొలగించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఆరోగ్యానికి యోగా ఎంతో ప్రాధాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారని, యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి ఎంతో గుర్తింపు వచ్చిందని, తమకు యోగా ట్రైనర్లుగా కాంట్రాక్ట్ లేదా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని పల్లాకు వినతి పత్రం ద్వారా కోరారు.

విశాఖ బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్ర

టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ విమర్శ



గండి బాబ్జీ

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు వైసీపీ నాయకులు కుట్ర పన్ని, లేనిపోని అభాండాలు వేస్తున్నారని రాష్ట్ర కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ విమర్శించారు. యోగాంధ్ర కార్యక్రమంతో ప్రపంచ వ్యాప్తంగా విశాఖ పేరు మార్మోగిందని, అలా మంచిపేరు రావడం వైసీపీ వారికి ఇష్టంలేదన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లపాలనలో విశాఖ కేంద్రంగా వేల కిలోల గంజాయిని ఎగుమతి చేశారని, నేడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈగల్ టీం, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ గంజాయిని ఉక్కుపాదంతో అణచివేస్తోందన్నారు. ఫలితంగా గతంలో లక్షల ఎకరాల్లో ఉన్న గంజాయి సాగు నేడు గణనీయంగా తగ్గిందన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఏజెన్సీకి వెళ్లి గిరిజనులకు ఉద్యానవన మొక్కలు అందించారన్నారు. విశాఖలో డ్రగ్స్ ఉంటున్నాయని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఎద్దేవా చేస్తూ, వైసీపీ హయాంలో ఏం జరిగిందో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. చిత్తూరు జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం ద్వారా వైసీపీ నేతలు తమ రౌడీయిజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని గండి బాబ్జీ దుయ్యబట్టారు. విశాఖ జడ్పీలో వైసీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ దిగజారుడు రాజకీయాలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

పోలీసులపై కేసు నమోదు చేయాలని మంత్రికి వినతి



మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతి పత్రం అందజేస్తున్న విదసం నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తెనాలి యువకులను కొట్టిన పోలీసులపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని విదసం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ప్రభుత్వ అతిథి గృహంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ తెనాలిలో ఇద్దరు దళిత, ఒక మైనారిటీ యువకులను పోలీసులు విచక్షణారహితంతగా కొట్టారని ఇది తీవ్రమైన తప్పిదమని అన్నారు. ఈ విషయంపై హోంశాఖ మంత్రితో మాట్లాడుతానని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు. అసైన్డ్ భూములను రామ్‌దేవ్ బాబాకు ఇవ్వవద్దని, విశాఖ భూములపై సిట్ నివేదిక బయట పెట్టాలని కోరామని తెలపారు. దీనిపై మంత్రి స్పందిస్తు ఎస్సీల భూములు ఎస్సీలకే అమ్మాలంటే అమ్ముకునే వారు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విదసం నాయకులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

కంచరపాలెం,జూలై 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని ఓ ప్రైవేటు స్థలంలో గంజాయి మొక్కలను స్థానిక కంచరపాలెం ఎస్ఐ షేక్ సమీర్ స్వాధీనం చేసుకున్నారు. వివారులు ఇలా ఉన్నాయి.. జ్ఞానపురం రాసవీధిలో ఓ ప్రైవేటు స్థలంలో రెండు గంజాయి మొక్కలు ఉన్నట్లు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ షేక్ సమీర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఇదిలా ఉండగా గంజాయి మొక్కలు లభించిన స్థలానికి జీవీఎంసీ, రెవిన్యూ అధికారులుతో కంచరపాలెం సీఐ కె.రవికుమార్ చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. 13 ఎకరాల ఉన్న ఆ స్థలంఓ బిషప్ పేరున ఉన్నట్టు గుర్తించారు. అనంతరం ఉన్నతాధికారుల సూచన మేరకు గంజాయి మొక్కలు లభించడంపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేశారు.

45వ వార్డులో తొలి అడుగు

అక్కయ్యపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం తారకరామ నగర్‌లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకు లు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏబీకేఎంవై నేషనల్ స్పోక్స్‌పర్సన్‌గా డిఎస్ వర్మ



డీఎస్ వర్మ

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువకు నేషనల్ స్పోక్స్‌పర్సన్‌గా డి.శ్రీనివాస వర్మ నియమితులైయ్యారు. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు. ఏబీకేఎంవై నేషనల్ అధ్యక్షుడు కున్వర్ అవినాష్ సింగ్ చేతుల మీదుగా అందుకున్నట్టు డీఎస్ వర్మ తెలిపారు.

జిమ్నాస్టిక్స్ సాధనకు ఆటంకపరచొద్దని ప్రముఖులకు వినతి

విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇండోర్ హాల్లోని మల్టీ స్పోర్ట్స్ సదుపాయాల నిర్మాణాలను నిలిపివేసి జిమ్నాస్టిక్స్ క్రీడాభివృద్ధికి సహకారం అందించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. డీఎస్ఏ ఇండోర్ హాలులో సగ భాగాన్ని బ్యాడ్మింటన్‌కు కేటాయించడం వల్ల జిమ్నాస్టిక్స్ సాధనకు ప్రతికూలంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని, ఫలితాల దిశగా వెళుతున్న జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్‌కు మెయిల్ చేశారు.

మంత్రి, ఎమ్మెల్యేల హామీ...

కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు గణబాబు, రామకృష్ణబాబులు హామీ ఇచ్చారు. నగరంలో పలుచోట్ల బ్యాడ్మింటన్ కోర్టులు ఉండగా, ఏకైక జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని మల్టీ స్పోర్ట్స్ హాలుగా మార్చాల్సిన అవసరం ఏముందని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం గమనించదగ్గ విషయం.

మద్యం దుకాణం మూసివేయాలని డిమాండ్



మద్యం దుకాణం దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

కంచరపాలెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామంలో పైడిమాంబ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మూసివేయాలని గ్రామస్థులు శుక్రవారం నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాము ఆరాధ్య దైవంగా కొలిచే అమ్మవారి ఆలయానికి సమీపంలో మద్యం దుకాణాన్ని ఎందుకు ఏర్పాటు చేశారంటూ పలువురు గ్రామస్థులు ఆందోళన చేశారు. నిబంధనలకు కట్టుబడి గుడికి వంద మీటర్ల దూరంలో తమ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నామని యజమానులు తెలపారు. ఆందోళన తీవ్రత పెరగడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. గ్రామంలోనే కాకుండా నగరం మొత్తం మీద పైడిమాంబ ఆలయానికి ప్రశస్తి ఉండడంతో ఎట్టి పరిస్థితిలోను ఆ విషయాన్ని వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'భక్తులకు సేవ చేయడం దైవసేవే...'



సమావేశంలో మాట్లాడుతున్న యూనిటీ ఫౌండేషన్ ప్రతినిధులు

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామిని భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు సేవలు అందించడం దైవానికి చేసినట్లుగా భావించామని యూనిటీ ఫౌండేషన్, ప్రైమావల్ టెక్నాలజీస్, ఆక్సల్ ఎస్టెటిక్స్ ప్రతినిధులు తెలిపారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నవారిలో సుమారు 50 వేల మందికి బిస్కెట్లు, ఓఆర్ఎస్, మందులు, ప్రసాదం, మంచినీరు అందించామన్నారు. యూనిటీ ఫౌండేషన్, రోడియస్ రియల్టీ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి, రోడ్ సేఫ్టీ, సైబర్ సెక్యూరిటీ కోసం దేశంలో యూనిటీ యాత్రలను, సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందులో వీరు మామాస్ బ్రాండ్ భాగస్వామ్యం కావడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

నిర్వహణ సామర్థ్యాల పెంపునకు సెషన్స్ దోహదం : డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (విశాఖ) నిర్వహించిన నాయకత్వ అభివృద్ధికి సంబంధించి ఇంటెన్సివ్ సెషన్స్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. నగరంలో ఐదు రోజులు జరిగిన ఈ సెషన్స్‌లో మహానది కోల్ ఫీల్డ్ లిమిటెడ్ (ఎంసీఎల్)కు చెందిన 21 మంది అధికారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ రంగ నిపుణులలో నిర్వహణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆధునిక ప్రభుత్వ రంగంలో సంక్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు కమ్యూనికేషన్, మేధస్సు, కార్పొరేట్ ఫైనాన్స్ సమర్థత వంటి నాయకత్వ లక్షణాలు అవసరమని డీఆర్ఎం అభిప్రాయపడ్డారు.

కళాశాలల్లో ప్రపంచ జనాభా దినోత్సవం

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఆర్థిశాస్త్ర విభాగం శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనాబా 'పెరుగుదల - సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో విద్యార్థులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ జనాభా పెరుగుదలను వాస్తవ అభివృద్ధిగా మలచాలంటే విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారిత వంటి అంశాలతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. జనాబా నియంత్రణలో యువత పోషించాల్సిన పాత్రను వివరించారు. అనంతరం ఏయూ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు.

జ్ఞానాపురం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లిఖిత మాట్లాడుతూ నేటి యువత కెరీర్ వైపు ఎ క్కువ దృష్టి పెట్టడం వల్ల వివాహం చేసుకోవడానికి, పిల్లలను కనడానికి ఇష్టపడడంలేదని అన్నారు. ఇది దేశ జనాభా, సంతానోత్పత్తి రేట్లపై ప్రభావితం చూపుతోందన్నారు.

స్కాలర్ షిప్‌ల పంపిణీ

అల్లిపురం,జులై11(ఆంధ్రజ్యోతి): అల్లిపురం రైల్వే స్కూల్ పూర్వ విద్యార్థి డబ్బీరు రమామణి, ఎల్ ప్రసాదరావు దంపతులు వడాల అకడమిక్ ఎక్సలెన్స్ కింద విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. ఈ సందర్భంగా 2024 - 25 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను కార్పొరేటర్ కందుల నాగరాజు, ఏయూ ప్రొఫెసర్ పి. విశ్వనాథం శుక్రవారం అందజేశారు. ఈ కర్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై. మీనాక్షి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేషన్‌లో ఎండ్ ప్లాట్‌ఫారం

(5వ పేజీ తరువాయి)

శిక్షణ ఇచ్చామన్నారు. కొండ ప్రాంతాల్లో పనిచేసే వారికి జీపీఎస్ పరికరాలు ఇస్తామన్నారు. వారికి ఎక్కడైనా ట్రాక్ ప్రమాదకరంగా ఉన్నట్టు కనిపిస్తే ఆ పరికరం ద్వారా తమ ఉన్నతాధికారికి తెలియజేస్తారని, సాయం అవసరమైతే రెండో బటన్ నొక్కి ఇతర పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇస్తారని, రైళ్ల రాకపోకలు ఆపేయాల్సిన పరిస్థితి ఉన్నట్టయితే మూడో బటన్ నొక్కి రెండు వైపులా స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేస్తారన్నారు. ఆ విధంగా జీపీఎస్‌లను రూపొందించామన్నారు. వీటి వల్ల ప్రమాదాలు తగ్గుతాయని డీఆర్ఎం అభిప్రాయపడ్డారు.

రైళ్ల వేగం 130 నుంచి 160 కి.మీ.

విశాఖపట్నం నుంచి దువ్వాడ మీదుగా పలాస వరకు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ (ప్రహరీ గోడలు) నిర్మిస్తున్నామని, దీనివల్ల పశువులు, గొర్రెలు వంటివి ట్రాక్‌పైకి రాకుండా ఉంటాయన్నారు. దీంతో ఆ లైన్‌లో ప్రస్తుతం 130 కి.మీ. వేగంతో నడుస్తున్న రైళ్లను 160 కి.మీ. వేగంతో నడిపే అవకాశం కలుగుతుందన్నారు.

జీఎం కార్యాలయం కోసం రెండు, మూడు భవనాల పరిశీలన

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణం ముడసర్లోవలో జరుగుతున్నదని, జనరల్ మేనేజర్ కోసం రెండు, మూడు భవనాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. సిరిపురం వీఎంఆర్‌డీఏకు చెందిన ది డెక్‌లో ఒక అంతస్థు అడిగామన్నారు. అలాగే స్టేషన్‌కు సమీపంలో నిర్మించిన గతి శక్తి భవనాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత

విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించేశామని, అవి ఇకపై వాయువేగంతో జరుగుతాయన్నారు. అనుకున్న గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి గళం

(5వ పేజీ తరువాయి)

కొంతమంది చెప్పారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకుంటారేమోనని నాలుగైదు నెలలుగా వేచి చూస్తున్నామని, కానీ ఎవరూ కనీసం పట్టించుకోలేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ దశలో ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జోక్యం చేసుకుని చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఎంతమంది, వ్యతిరేకంగా ఎంతమంది ఉన్నారో తేలాలంటే చేతులెత్తే పద్ధతిని పాటించవచ్చునని, లేని పక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సమావేశమై ఒక నిర్ణయానికి రావచ్చునని అన్నారు. దీంతో సభ్యులను బయటకు పంపి నాయకులు చర్చిం చుకున్నారు. ఆ తరువాత అందరినీ లోపలకు రప్పించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నానని, అధినేత జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అంతవరకూ సంయమనం పాటించాలన్నారు. దీంతో కొందరు సభ్యులు లేచి వారం, పది రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లాలని అడగ్గా...నెల తరువాత తీసుకువెళతానన్నారు. అయితే జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్న సభ్యుల డిమాండ్‌కు నేతలు అంగీకరించలేదు. మరో ఏడాదిలో జడ్పీ కాలపరిమితి ముగుస్తోందని, అప్పటివరకూ అందరూ కలిసి వెళ్లాలని సూచించారు. సభ్యులంతా మాట్లాడినప్పటికీ చైర్‌పర్సన్ మాత్రం మౌనంగా ఉన్నారు. జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ చైర్‌పర్సన్ పదవి ఇస్తామన్న హామీతోనే అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానని గుర్తుచేస్తూ తనకు అన్యాయం జరిగిందన్నారు. ఈ దశలో బొత్స జోక్యం చేసుకుని అధినేతను కలిసి సమస్య విన్నవించుకోవాలన్నారు. ఇదిలావుండగా పార్టీ నేతల వద్ద ఏర్పాటుచేసిన పంచాయి తీలో ఏమీ తేలకపోవడంపై పలువురు జడ్పీటీసీ సభ్యులు బయటకు వచ్చి అసంతృప్తి వ్యక్తంచేశారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాల్సిందేనని కొందరు అన్నారు.

విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు

(5వ పేజీ తరువాయి)

నమోదయ్యాయి. వీటిలో ఇప్పటివరకూ 58,274 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదుచేసుకోగా, మొక్కల పెంపకానికి 56,395 మంది ముందుకువచ్చారు. ఒక్కొక్క విద్యార్థి ఒకటి నుంచి మూడు మొక్కలు తీసుకునేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు జిల్లాలో 89,040 మొక్కలు తీసుకునేందుకు విద్యార్థులు తమ పేర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద నమోదుచేసుకున్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్‌వరకు చదివే విద్యార్థులను గ్రీన్‌పాస్‌పోర్టులో నమోదుచేసి వారికి మొక్కలు అందజేస్తారు. సామాజిక అటవీ విభాగం నర్సరీల నుంచి శుక్రవారం వరకు జిల్లాలో పాఠశాలలకు 50,309 మొక్కలు చేరాయి. రవాణా ఖర్చులు పాఠశాలలు భరించాయి. విద్యార్థులకు సీమబాదం, ఎర్రచందనం, దేవకాంచనం, అంకుడు, గానుగు, తురాయి, మహాగని, మామిడి తదితర జాతులకు చెందిన మొక్కలు అందజేశామని జిల్లా అటవీ శాఖాధికారి జి.మంగమ్మ తెలిపారు. కాగా విద్యార్థులకు మొక్కల పంపిణీ నుంచి వాటిని నాటడం, పెంపకంపై ఉపాధ్యాయులు సూచనలు ఇస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత నెలకొంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని విద్యార్థులకు వివరించామన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితాలు

(5వ పేజీ తరువాయి)

13వ తేదీలోగా అర్జీ పెట్టుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు ఆన్‌లైన్‌లో పరిశీలించి జాబితాలో పేరు లేకపోతే కారణాలు తెలుసుకుని వెంటనే సవరణ చేసి తహశీల్దారుకు పంపుతారన్నారు. ఇంకా మనమిత్రకు వాట్సాప్ ద్వారా 9552300009కు లేదా కాల్‌సెంటర్ నంబరు 155251కు కాల్ చేయాలని సూచించారు.

ఐఎఫ్ఆర్, మిలాన్ నిర్వహణపై సమీక్ష

(5వ పేజీ తరువాయి)

శాఖలు, విభాగాల అధిపతులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఈ సమావేశంలో నేవీ, విమానాశ్రయం, విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్ రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పోలీస్, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. నేవల్ ఆఫీస్ ఇన్‌చార్జి రజనీశ్‌శర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, నేవీ అధికారులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది ద్వారా చేయిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి 28 వరకూ పరిశీలన చేసి తుది జాబితా తయారుచేయడం జరుగుతుందన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. రూట్స్ యాప్ ద్వారా వివరాలను సేకరించి, ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి దిగ్విజయం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలనుపైకి తీసుకురావడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి విషయంలో బంగారు కుటుంబాలకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారన్నారు. సమీక్ష సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పీవీజీఆర్ నాయుడు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశోధనల నాణ్యతలో రాజీ పడవద్దు

- నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఏయూ వీసీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాలకు చెందిన నిపుణులతో విశ్వవిద్యాలయ విద్యార్థులను అనుసంధానం చేసే శతాబ్దివాణి కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అకడమిక్ సెనేట్ మందిరంలో ఈ కార్యక్రమాలను ఉపకులపతి జీపీ రాజశేఖర్ ప్రారంభించారు.

అనంతరం జియో ఫిజిక్స్ విభాగంలో పరిశోధకులకు ఉద్దేశించి 'ద ఆర్ట్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్' అనే అంశంపై ప్రత్యేక ప్రసంగంలో వీసీ మాట్లాడుతూ పరిశోధనల్లో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకునే విధానం, పరిశోధన జరపడానికి అవసరమైన అంశాలు, పరిశోధన జరిపే విధానం, నాణ్యమైన పరిశోధనలు జరపడానికి అవసరమైన సూచనలు అందజేశారు. పరిశోధకులు స్వీయ ప్రేరణతో ముందుకు సాగాలని సూచించారు. అదే సమయంలో తమ ఆలోచనలను ధైర్యంగా, స్వేచ్ఛగా ఇతరులతో పంచుకోవాలన్నారు. జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొనడం, తమ పరిశోధనకు సంబంధించిన అంశాలపై ప్రసంగించడం, నిపుణుల సూచనలు, ఆలోచనలను స్వీకరించడం అలవాటు చేసుకోవాలన్నారు.

ప్రధాన అంశాలైన లిటరేచర్ రివ్యూ, రీసెర్చ్ టూల్స్, మెథడాలజీ, అనాలసిస్, టెక్నికల్ రైటింగ్, సరైన జర్నల్స్‌ను ఎంపిక చేసుకోవడం, రీసెర్చ్ ప్రపోజల్ రచన తదితర అంశాలను విపులంగా వివరించారు. సమాచారాన్ని పొందడానికి ఉపయుక్తంగా నిలిచే పుస్తకాలు, జర్నల్స్ పరిశోధన గ్రంథాలు, ఈ-రిసోర్సెస్, ఇంటర్నెట్ సమాచారం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పరిశోధనలో భాగంగా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించే విధానాలు, పరిశోధనా గ్రంథరచనలో వీటిని వివరించే పద్ధతులను సోదాహరణంగా తెలియజేశారు. సరళంగా, సులభంగా, ఆసక్తిదాయకంగా పరిశోధన గ్రంథ రచన చేసే విధానాన్ని పరిశోధకులకు తెలిపారు. పరిశోధనకు అవసరమైన అంశాన్ని ఏ విధంగా గుర్తించాలి, గతంలో జరిగిన పరిశోధనలు, అధ్యయనం చేయడం వర్తమాన అవసరాలకు అనుగుణంగా సమస్యను గుర్తించి దానికి పరిష్కారాలను చూపించాల్సి విధానాన్ని వివరిస్తూ.. ఈ ప్రక్రియలో పరిశోధకులు అనుసరించాల్సిన ఆలోచన సరళిని విపులంగా తెలియజేశారు. పరిశోధన లక్ష్యాలను వివరించడం ఎంతో ప్రధానమని చెప్పారు. పరిశోధన జరిపే ప్రక్రియలో ఎవరి భాగస్వామ్యం స్వీకరించాలి, అత్యుత్తమైన జర్నల్ ఎంపిక చేసుకోవడం, వాటిలో పరిశోధనా పత్రాలను ప్రచురించడం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి మార్గాలను సైతం సూచించారు.

శతాబ్దివాణి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీన్ ఔట్రీచ్ కె.రమాసుధ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాల నిపుణులను విశ్వవిద్యాలయానికి ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు.ఈ నెల 17న శతాబ్ది వాణిలో రెండో ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో ఔట్రీచ్ అసోసియేట్ డీన్ వెంకటరావు, ప్రిన్సిపాల్ గిరిజాశంకర్, ఆచార్యులు పద్మశ్రీ, సీతామాణిక్యం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనంద గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, ఖాళీ స్థలాల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

- జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ అధికారులకు మేయర్ పీలా ఆదేశం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలోని జీవీఎంసీ పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో చాలా వరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని నియంత్రణించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ఎన్ని పార్కులు, ఖాళీ స్థలాలు ఉన్నాయి, ఆక్రమణకు గురైనవి, అభివృద్ధి చేసిన పార్కులు, పరస్పర బదలాయింపు ద్వారా మార్పిడి చేసిన స్థలాలు, పార్కులు తదితర వివరాలతో పూర్తి నివేదిక సోమవారం నాటికి ప్రభుత్వ జీవోలతో సహా అందించాలన్నారు. ఖాళీ స్థలాలు, పార్కులపై తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేయర్ అధికారులను హెచ్చరించారు. పార్కులు, ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతానని తెలిపారు. సమావేశంలో సీసీపీ ఎ.ప్రభాకర్, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ మీనా కుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్లు ధనుంజయరెడ్డి, హరిదాస్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గ అమ్మవారు


కూరగాయలతో అలంకరించిన అమ్మవారు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సంజీవ్ గాంధీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆషాడమాసం పురస్కరించుకుని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక అలంకరణలో భాగంగా వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శర్మ భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, సూర్యనారాయణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య పరిశ్రమకు పెరిగిన ప్రాధాన్యం

- జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడు ఎం.గురునాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న గురునాథరావు

బీచ్ రోడ్డు, జూలై 11, (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య పరిశ్రమ కీలకంగా మారిందని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడు ఎం. గురునాథరావు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మత్స్యశాఖ సహకార శాఖ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ ఇయర్ ఆఫ్ కో-ఆపరేటివ్-2025ను పురస్కరించుకొని ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పలు రకాల పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూనే అభివృద్ధిపై దృష్టి సారిస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మత్స్య పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని, దేశంలో ఏర్పాటయ్యే మత్స్య పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలను స్థాపించేవారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. మత్స్యకారుల అభివృద్ధిలో మత్స్య పారిశ్రామిక సంఘాల పాత్ర సంఘాల నిర్వహణ, ఆడిట్ సంఘాల అభివృద్ధికి ప్రణాళికపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ప్రవీణ, జిల్లా మత్స్య సంఘం ఉపాధ్యక్షుడు ఆడిబాబు, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి ధనుంజయరావు, మత్స్య శాఖ ఎ.డి. విజయ్‌కృష్ణ, మత్స్య శాఖ అధికారి ఆశాజ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతరంతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసుల నాయుడు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ యువత దేశభవితకు అండగా నిలుస్తారని శాసన మండలి సభ్యుడు గాదె శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం విలువైన మానవ వనరులుగా నిలవాలని సూచించారు. కళాశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయిస్తూ సమాజ సమస్యలకు పరిష్కారాలను చూపాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, ఎల్లప్పుడూ ఆ దిశగా కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టి విద్యార్థులుగా తామంతా సమాజంలో ప్రధానంగా చిన్నారులలో సత్ప్రవర్తన, మానవత్వం పెంపొందించే దిశగా పనిచేయాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటామని, దీని ద్వారా ప్రజలలో జనాభా వృద్ధిపట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. భారతదేశ జనాభాను ముఖ్యంగా యువతను సమాజ ఉపయుక్తంగా తీర్చిదిద్దవలసిన ఆవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టే నేటి తరం విద్యార్థులు భవిష్యత్ సవాళ్లను స్వీకరించడానికి, వాటికి అనువైన పరిష్కారాలను చూపడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు అన్నవరపు చంద్రమోహన్ జనాభా అభివృద్ధి, పర్యవసానాలు, పరిష్కారాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి, డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ : ఏయూ వీసీ


మొక్కలు నాటుతున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏయూ నార్త్ క్యాంపస్‌లోని అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహాల ప్రాంగణంలో విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏయూ హార్టీ కల్చర్ గార్డెనింగ్ విభాగం ప్రత్యేకంగా వివిధ పండ్ల జాతులు మొక్కలను, దీర్ఘకాలం జీవించే మొక్కలను ఇక్కడ నాటారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలను అందించిన వీసీటీపీఎల్ అధికారులకు వీసీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వీసీటీపీఎల్ ప్రతినిధులు టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీ, వైస్ ప్రెసిడెంట్ హెచ్ఆర్-అడ్మిన్ ఎంఎస్ రావు, పీఆర్-సెక్యూరిటీ విభాగం సీనియర్ జనరల్ మేనేజర్ జిత, ఆపరేషన్ విభాగం హెడ్ మధు, రిక్రూట్మెంట్ హెడ్ కుమార్, ధనుంజయ్, ఏయూ హార్టీ కల్చరల్ విభాగం డీన్ ఎస్బీ పడాల్, అకడమిక్ డీన్ శ్రీనివాసరావు వృక్షశాస్త్ర విభాగాధిపతి సంధ్యా దీపిక, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య యుగంధర్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైదానంలో మామిడి, సపోటా, సీతాఫలం, నేరేడు, బాదం, మహాగని వంటి మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చుట్టూ రక్షణ కంచెను సైతం ఏర్పాటు చేశారు.

జనాభా వృద్ధి పర్యవసానాలను అర్థం చేసుకోవాలి

- ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (ఐఎస్ఐ) పూర్వాచార్యులు టీజే రావు




మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్, వేదికపై టీజేరావు, ఇతర ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఏర్పడే పర్యవసానాలను అర్థం చేసుకోవాలని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) పూర్వాచార్యులు టీజే రావు అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్టాటిస్టిక్ విభాగంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ జనాభా దినోత్సవం వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజే రావు మాట్లాడుతూ జనాభా అధ్యయనం గణాంకాలను సిద్ధం చేసే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. జనాభాకి అనుగుణంగా సమాన అవకాశాలు కల్పించడం, సమాజంలో సమానత్వాన్ని స్థాపించడం ఎంతో ప్రధానమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేసే దిశగా యువతరం కృషి చేయాలన్నారు శతాబ్ది సంవత్సరంలో ఏయూలో విద్యను అభ్యసిస్తున్న యువతను ఈ సందర్భంగా అభినందించారు. జపాన్‌లో జనాభా వృద్ధి తగ్గిపోవడం, వృద్ధుల జనాభా పెరగడం వలన ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేశారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ పర్యావరణహిత జీవనంపై దృష్టి సారించాలని సూచించారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ జనాభా అభివృద్ధి జరిగే సమయంలో తగిన పోషకాహారం, సరైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటివి చేయాలన్నారు. జనాభా అధ్యయన కేంద్రం సంచాలకులు బి.మునిస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 జనాభా అధ్యయన కేంద్రాలు సేవలను అందిస్తున్నాయని, 1977 నుంచి ఏయూలో ఈ కేంద్రం సేవలను అందిస్తున్న విధానాన్ని వివరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి సూచనలు చేస్తాం

- లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మదింపు చేసి వాటి పనితీరు మెరుగుపర్చేందుకు ప్రభుత్వానికి సూచనలు చేయనున్నట్టు ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉత్త రాంధ్రలోని ప్రభుత్వ రంగ సంస్థల అధికారులతో కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు తమ అకౌంట్లు, ఆడిట్‌పై పూర్తిస్థాయి సమాచారంతో కూడిన నివేదికలు అందజేసినప్పుడే తాము ప్రభుత్వానికి సరైన నివేదికలు సమర్పించగలమన్నారు. కాగా జీవీఎంసీ పరిధిలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలు, చేపట్టిన ప్రాజెక్టులను కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. వీఎంఆర్‌డీఏ చేపడుతున్న కార్యకలాపాలపై జాయింట్ కమిషనర్ రమేష్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిపై కమిటీ చైర్మన్ స్పందిస్తూ విశాఖ నగరాభివృద్ధి సంస్థకు సంబంధించి న్యాయ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేకంగా జ్యుడీషియల్ ప్యానల్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఏపీఐఐసీ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములు సద్వినియోగం అయ్యేలా, పరిశ్రమలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పనితీరుపై కమిషనర్ ప్రసాదరావు వివరించారు. పర్యాటక ప్రాజెక్టుల గురించి ప్రాంతీయ పర్యాటక డైరెక్టర్ జగదీష్ వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సి.ఐజాక్‌బాషా, నడికుదిటి ఈశ్వరరావు, ఆర్వీఎస్‌కేకే రంగారావు, గిడ్డి సత్యనారాయణ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, శాసనసభా కమిటీ సంయుక్త కార్యదర్శి పీవీ సుబ్బారెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, ఏపీఐఐసీ జడ్ఎం సింహాచలం, వీఎంఆర్డీఏ ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పర్యాటకాధికారులు నారాయణరావు, కుమారస్వామి, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

'జాప్' నగర శాఖ నూతన కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) విశాఖ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంవీపీ కాలనీ గిరిజన్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా కేఎం కీర్తన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా జేవీకే అప్పలరాజు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను జాప్ వ్యవస్థాపకుడు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రవితేజ, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఎన్‌యుజె కార్యదర్శి శశి పర్యవేక్షించారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు

వెంకోజీపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా నిర్వహించిన ఈ ఫోరమ్‌లో జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు ఫిర్యాదులను స్వీకరించారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు తదితర వాటిని ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చని ప్రభాకరరావు తెలిపారు.

రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ


రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని 125 మంది రిసోర్స్ పర్సన్లకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతులమీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరులోని వుడా కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డిజిటల్ పద్ధతుల్లో పని చేయడం వల్ల పని సామర్థ్యం పెరగడంతో పాటు, సామాజిక సంక్షేమ పథకాల అమలు సక్రమంగా, వేగంగా జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్పొరేటర్లు గొలగాని మంగవేణిపోలారావు, పీతల మూర్తియాదవ్, అధికారులు పాల్గొన్నారు.

యథాస్థానంలోనే భూలోకమాత అమ్మవారి ఆలయం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు ఆలయ కమిటీ విన్నపం


వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మద్దిలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో సీఎంఆర్ సెంట్రల్ పక్కన ఉన్న శ్రీభూలోకమాత అమ్మవారి ఆలయానికి ఎటువంటి ఆటంకం కలిగించవద్దని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. విశిష్ట చరిత్ర కలిగిన అమ్మవారి గుడి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఆలయాన్ని యథాస్థానంలో ఉండేవిధంగా చర్యలు చేపట్టి భక్తుల మనోభావాలను గౌరవించాలన్నారు. అలాగే ఆలయం ఎదురుగా మూడు లైన్లతో రహదారులు ఉన్నందున ఉత్సవాల్లో సమయంలో సమస్యలు వస్తున్నాయన్నారు. మూడు రోడ్లను రెండు రహదారులుగా మార్పు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు.

దీనికి స్పందించిన ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూలోకమాతా అమ్మవారి ఆలయాన్ని యథాస్థానంలో ఉండేవిధంగా ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లానన్నారు. బీఆర్‌టీఎస్ ప్రణాళికలో ఉన్న మూడు రహదారులను రెండు రహదారులుగా మార్పు చేయడం తమ పరిధిలో లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బేరి గురునాధరెడ్డి, కార్యదర్శి అప్పలస్వామి రెడ్డి, కార్పొరేటర్ పద్మారెడ్డి, టీడీపీ నాయకులు బర్ల బాలకృష్ణ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో జనాభా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌బాబు

మద్దిలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విద్యావంతులు, ఆరోగ్యవంతులైన జనాభా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జనాభా సమస్యలపై అవగాహన కల్పించేందుకు, పర్యావరణ అభివృద్ధికి ప్రతి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించాలని 1990లో ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసిందన్నారు. అప్పటి నుంచి జనాభా సమస్యల ఆవశ్యకత, ప్రాముఖ్యతపై దృష్టి కేంద్రీకరించడానికి జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించిన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కె.రవిబాబు, అర్థశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ లక్ష్మి, పోల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువ జాతీయ అధికార ప్రతినిధిగా శ్రీనివాస్ వర్మ



పెదవాల్తేరు, జూలై 11 : (ఆంధ్రజ్యోతి) అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువ జాతీయ అధికార ప్రతినిధిగా బీజేపీ సీనియర్ నాయకుడు దాట్ల శ్రీనివాస్ వర్మ నియమితులయ్యారు. అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువ జాతీయ అధ్యక్షుడు కున్వర్ అవినేష్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. దాట్ల శ్రీనివాస్ వర్మ ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన బాధ్యతలు నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు.

కర్ణాటక సంగీత కళాకారిణి జలజాక్షికి గురు సత్కారం



రామ్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్రస్వామి మఠంలో వ్యాస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు, ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో గురు సత్కారం పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిష్యబృందం భక్తితో గురు వందనాన్ని సమర్పించారు అనంతరం ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.జలజాక్షిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మఠం చెర్మన్ ఎ.వెంకటరావు. ప్రతినిధులు కె.సుబ్రహ్మణ్యం, జగన్‌మోహనరావు, ఎం. మధుబాబు తదితరులతో పాటు పలువురు సంగీత కళాకారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడీ, శ్రీవెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 31, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 48, దొండకాయలు 42, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 38, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

బ్రాయిలర్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

ఇన్‌ఆర్బిట్‌మాల్‌లో అల్లు అర్జున్ సినిమా థియేటర్లు



ఇనార్బిట్‌మాల్‌లో స్ర్కీన్ నిర్మాణానికి పూజ చేస్తున్న అల్లు అరవింద్, చిత్రంలో భీమిలి ఎమ్మెల్యే గంటా తదితరులు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి దగ్గర నిర్మిస్తున్న ఇన్‌ఆర్బిట్ మాల్‌లో ఏర్పాటు చేయనున్న సినిమా స్ర్కీన్‌కు ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పూజలు చేశారు. ఏషియన్ అల్లు అర్జున్ (ఏఏఏ) సినిమా పేరిట మాల్‌లో 8 స్ర్కీన్‌లు అరవింద్ తీసుకున్నారు. ఇన్‌ఆర్బిట్‌మాల్ స్ట్రక్చర్ నిర్మాణం ఓ కొలిక్కి రావడంతో టాప్ ఫ్లోర్‌లో అరవింద్ పూజా కార్యక్రమాలతో తదుపరి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. విశాఖ పరిసరాల్లో టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్, సత్వా, ఏఎన్ఎస్ఆర్ తదితర ఐటీ సంస్థలతో పాటు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు కూడా ఊపందుకోనున్న నేపథ్యంలో మాల్స్‌కు డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పి.సందీప్, గీతా ఆర్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఓపెన్ జిమ్ పరికరాలు బహూకరణ

అక్కయ్యపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి ప్రతినిధులు శుక్రవారం ఓపెన్ జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు టి. సత్యశ్రీ లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం ఎంతో అవసరమని అన్నారు. ఈ సదర్భంగా వ్యాయమ ఉపాధ్యాయురాలు రత్నం కోరిక మేరకు తమ వంతు సాయంగా పాఠశాలకు ఓపెన్‌జిమ్ పరికరాలను అందించినట్లు చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయురాలు జయంతి రాధా మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రతినిధులు అందించిన జిమ్ పరికరాలను విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ఆనందం వ్యక్తం చేశారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

అక్కయ్యపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 46వ వార్డులో ప్రజలకు సేవలందించి వేరే ప్రాంతాలకు ఉద్యోగ రీత్యా బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజల కోసం సేవలందించే సచివాలయం సిబ్బంది బదిలీపై మరో చోటికి వెళ్ళడంతో బాధాకరంగా ఉందన్నారు.

సామరస్యంతో కేసులు రాజీ చేసుకోవాలి

మహారాణిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సామరస్యంతో కేసులను రాజీ చేసుకుంటే మంచిదని శుక్రవారం నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి చిన్నం శెట్టి రాజు అన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాలను 90 రోజుల ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలు

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పౌరగ్రంథాలయంలో పోటీపరీక్షలకు చదువుతు న్న ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలను శుక్రవార ం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తమాన అంశాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, భారత ఆర్థిక వ్యవస్థ, భౌగో ళ శాస్త్రం తదితర అంశాలపై క్విజ్ పోటీను నిర్వహించారు. ఈ పోటీలో 50 మంది సభ్యు లు ఆరు బృందాలుగా పాల్గొన్నారు. క్విజ్ మాస్టర్‌గా డాక్టర్ డీవీ.సూర్యరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వతో డెంగ్యూ, మలేరియా వ్యాప్తి

» జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు

అల్లిపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జోన్- 4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. జీవీఎంసీ 34వ వార్డులో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి చేందకుండా మనల్ని మనమే కాపాడుకోవాలని అన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్ వైద్యాధికారి కృష్ణంరాజు, మలేరియా విభాగ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జీవో 77 రద్దు చేస్తామన్న హామినీ వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాగరాజు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి ఆందోళన చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే జీవో 77 ను రద్దు చేస్తామని యువగళం యాత్రలో నారా లోకేశ్ హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కోర్సు పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లు కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో 3900 కోట్లు విడుదనల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విద్యార్థులకు అందలేదని తెలిపారు. అలాగే డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్ విధానం ద్వారా కొనసాగించాలని కోరారు. వీలైనంత త్వరగా తమ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో యోగా ట్రైనర్ల పోస్టులను పునరుద్ధరించండి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న యోగా ఇన్‌స్ట్రక్టర్ అసోసియేషన్ సభ్యులు

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 1056 మంది యోగ ట్రైనర్‌లను కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో పునరుద్ధరణ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగ ఇన్‌స్ట్రక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ 2022 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా యోగా ట్రైనర్‌ను నియమించారని, ఆరు నెలలు రూ.16 వేల జీతం ఇచ్చారని, ఆ తరువాత విధుల నుంచి తొలగించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఆరోగ్యానికి యోగా ఎంతో ప్రాధాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారని, యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి ఎంతో గుర్తింపు వచ్చిందని, తమకు యోగా ట్రైనర్లుగా కాంట్రాక్ట్ లేదా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని పల్లాకు వినతి పత్రం ద్వారా కోరారు.

విశాఖ బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్ర

టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ విమర్శ



గండి బాబ్జీ

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు వైసీపీ నాయకులు కుట్ర పన్ని, లేనిపోని అభాండాలు వేస్తున్నారని రాష్ట్ర కోపరేటీవ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ విమర్శించారు. యోగాంధ్ర కార్యక్రమంతో ప్రపంచ వ్యాప్తంగా విశాఖ పేరు మార్మోగిందని, అలా మంచిపేరు రావడం వైసీపీ వారికి ఇష్టంలేదన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లపాలనలో విశాఖ కేంద్రంగా వేల కిలోల గంజాయిని ఎగుమతి చేశారని, నేడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈగల్ టీం, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ గంజాయిని ఉక్కుపాదంతో అణచివేస్తోందన్నారు. ఫలితంగా గతంలో లక్షల ఎకరాల్లో ఉన్న గంజాయి సాగు నేడు గణనీయంగా తగ్గిందన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఏజెన్సీకి వెళ్లి గిరిజనులకు ఉద్యానవన మొక్కలు అందించారన్నారు. విశాఖలో డ్రగ్స్ ఉంటున్నాయని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఎద్దేవా చేస్తూ, వైసీపీ హయాంలో ఏం జరిగిందో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. చిత్తూరు జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం ద్వారా వైసీపీ నేతలు తమ రౌడీయిజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని గండి బాబ్జీ దుయ్యబట్టారు. విశాఖ జడ్పీలో వైసీపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ దిగజారుడు రాజకీయాలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

పోలీసులపై కేసు నమోదు చేయాలని మంత్రికి వినతి



మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతి పత్రం అందజేస్తున్న విదసం నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తెనాలి యువకులను కొట్టిన పోలీసులపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని విదసం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ప్రభుత్వ అతిథి గృహంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ తెనాలిలో ఇద్దరు దళిత, ఒక మైనారిటీ యువకులను పోలీసులు విచక్షణారహితంతగా కొట్టారని ఇది తీవ్రమైన తప్పిదమని అన్నారు. ఈ విషయంపై హోంశాఖ మంత్రితో మాట్లాడుతానని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు. అసైన్డ్ భూములను రామ్‌దేవ్ బాబాకు ఇవ్వవద్దని, విశాఖ భూములపై సిట్ నివేదిక బయట పెట్టాలని కోరామని తెలపారు. దీనిపై మంత్రి స్పందిస్తు ఎస్సీల భూములు ఎస్సీలకే అమ్మాలంటే అమ్ముకునే వారు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విదసం నాయకులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

కంచరపాలెం,జూలై 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని ఓ ప్రైవేటు స్థలంలో గంజాయి మొక్కలను స్థానిక కంచరపాలెం ఎస్ఐ షేక్ సమీర్ స్వాధీనం చేసుకున్నారు. వివారులు ఇలా ఉన్నాయి.. జ్ఞానపురం రాసవీధిలో ఓ ప్రైవేటు స్థలంలో రెండు గంజాయి మొక్కలు ఉన్నట్లు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ షేక్ సమీర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఇదిలా ఉండగా గంజాయి మొక్కలు లభించిన స్థలానికి జీవిఎంసీ, రెవిన్యూ అధికారులుతో కంచరపాలెం సీఐ కె.రవికుమార్ చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. 13 ఎకరాల ఉన్న ఆ స్థలంఓ బిషప్ పేరున ఉన్నట్టు గుర్తించారు. అనంతరం ఉన్నతాధికారుల సూచన మేరకు గంజాయి మొక్కలు లభించడంపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేశారు.

45వ వార్డులో తొలి అడుగు

అక్కయ్యపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం తారకరామ నగర్‌లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకు లు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏబీకేఎంవై నేషనల్ స్పోక్స్‌పర్సన్‌గా డిఎస్ వర్మ



డీఎస్ వర్మ

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ క్షత్రియ మహాసభ యువకు నేషనల్ స్పోక్స్‌పర్సన్‌గా డి.శ్రీనివాస వర్మ నియమితులైయ్యారు. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు. ఏబీకేఎంవై నేషనల్ అధ్యక్షుడు కున్వర్ అవినాష్ సింగ్ చేతుల మీదుగా అందుకున్నట్టు డీఎస్ వర్మ తెలిపారు.

జిమ్నాస్టిక్స్ సాధనకు ఆటంకపరచొద్దని ప్రముఖులకు వినతి

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇండోర్ హాల్లోని మల్టీ స్పోర్ట్సు సదుపాయాల నిర్మాణాలను నిలిపివేసి జిమ్నాస్టిక్స్ క్రీడాభివృద్ధికి సహకారం అందించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. డీఎస్ఏ ఇండోర్ హాలులో సగ భాగాన్ని బ్యాడ్మింటన్‌కు కేటాయించడం వల్ల జిమ్నాస్టిక్స్ సాధనకు ప్రతికూలంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని, ఫలితాల దిశగా వెళుతున్న జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్‌కు మెయిల్ చేశారు.

మంత్రి, ఎమ్మెల్యేల హామీ...

కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు గణబాబు, రామకృష్ణబాబులు హామీ ఇచ్చారు. నగరంలో పలుచోట్ల బ్యాడ్మింటన్ కోర్టులు ఉండగా, ఏకైక జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని మల్టీ స్పోర్ట్సు హాలుగా మార్చాల్సిన అవసరం ఏముందని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం గమనించదగ్గ విషయం.

మద్యం దుకాణం మూసివేయాలని డిమాండ్



మద్యం దుకాణం దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

కంచరపాలెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామంలో పైడిమాంబ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మూసివేయాలని గ్రామస్థులు శుక్రవారం నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాము ఆరాధ్య దైవంగా కొలిచే అమ్మవారి ఆలయానికి సమీపంలో మద్యం దుకాణాన్ని ఎందుకు ఏర్పాటు చేశారంటూ పలువురు గ్రామస్థులు ఆందోళన చేశారు. నిబంధనలకు కట్టుబడి గుడికి వంద మీటర్ల దూరంలో తమ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నామని యజమానులు తెలపారు. ఆందోళన తీవ్రత పెరగడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. గ్రామంలోనే కాకుండా నగరం మొత్తం మీద పైడిమాంబ ఆలయానికి ప్రశస్తి ఉండడంతో ఎట్టి పరిస్థితిలోను ఆ విషయాన్ని వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'భక్తులకు సేవ చేయడం దైవసేవే...'



సమావేశంలో మాట్లాడుతున్న యూనిటీ ఫౌండేషన్ ప్రతినిధులు

సీతంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామిని భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు సేవలు అందించడం దైవానికి చేసినట్లుగా భావించామని యూనిటీ ఫౌండేషన్, ప్రైమావల్ టెక్నాలజీస్, ఆక్సల్ ఎస్తెటిక్స్ ప్రతినిధులు తెలిపారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నవారిలో సుమారు 50 వేల మందికి బిస్కెట్లు, ఓఆర్ఎస్, మందులు, ప్రసాదం, మంచినీరు అందించామన్నారు. యూనిటీ ఫౌండేషన్, రోడియస్ రియల్టీ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి, రోడ్ సేఫ్టీ, సైబర్ సెక్యూరిటీ కోసం దేశంలో యూనిటీ యాత్రలను, సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందులో వీరు మామాస్ బ్రాండ్ భాగస్వామ్యం కావడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

స్కాలర్ షిప్‌ల పంపిణీ

అల్లిపురం,జులై11(ఆంధ్రజ్యోతి): అల్లిపురం రైల్వే స్కూల్ పూర్వ విద్యార్థి డబ్బీరు రమామణి, ఎల్ ప్రసాదరావు దంపతులు పడాల అకడమిక్ ఎక్సలెన్స్ కింద విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. ఈ సందర్భంగా 2024 - 25 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను కార్పొరేటర్ కందుల నాగరాజు, ఏయూ ప్రొఫెసర్ పి. విశ్వనాథం శుక్రవారం అందజేశారు. ఈ కర్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై. మీనాక్షి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేషన్‌లో ఎండ్ ప్లాట్‌ఫారం

(5వ పేజీ తరువాయి)

శిక్షణ ఇచ్చామన్నారు. కొండ ప్రాంతాల్లో పనిచేసే వారికి జీపీఎస్ పరికరాలు ఇస్తామన్నారు. వారికి ఎక్కడైనా ట్రాక్ ప్రమాదకరంగా ఉన్నట్టు కనిపిస్తే ఆ పరికరం ద్వారా తమ ఉన్నతాధికారికి తెలియజేస్తారని, సాయం అవసరమైతే రెండో బటన్ నొక్కి ఇతర పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇస్తారని, రైళ్ల రాకపోకలు ఆపేయాల్సిన పరిస్థితి ఉన్నట్టయితే మూడో బటన్ నొక్కి రెండు వైపులా స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేస్తారన్నారు. ఆ విధంగా జీపీఎస్‌లను రూపొందించామన్నారు. వీటి వల్ల ప్రమాదాలు తగ్గుతాయని డీఆర్ఎం అభిప్రాయపడ్డారు.

రైళ్ల వేగం 130 నుంచి 160 కి.మీ.

విశాఖపట్నం నుంచి దువ్వాడ మీదుగా పలాస వరకు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ (ప్రహరీ గోడలు) నిర్మిస్తున్నామని, దీనివల్ల పశువులు, గొర్రెలు వంటివి ట్రాక్‌పైకి రాకుండా ఉంటాయన్నారు. దీంతో ఆ లైన్‌లో ప్రస్తుతం 130 కి.మీ. వేగంతో నడుస్తున్న రైళ్లను 160 కి.మీ. వేగంతో నడిపే అవకాశం కలుగుతుందన్నారు.

జీఎం కార్యాలయం కోసం రెండు, మూడు భవనాల పరిశీలన

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణం ముడసర్లోవలో జరుగుతున్నదని, జనరల్ మేనేజర్ కోసం రెండు, మూడు భవనాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. సిరిపురం వీఎంఆర్‌డీఏకు చెందిన ది డెక్‌లో ఒక అంతస్తు అడిగామన్నారు. అలాగే స్టేషన్‌కు సమీపంలో నిర్మించిన గతి శక్తి భవనాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత

విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించేశామని, అవి ఇకపై వాయువేగంతో జరుగుతాయన్నారు. అనుకున్న గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి గళం

(5వ పేజీ తరువాయి)

కొంతమంది చెప్పారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకుంటారేమోనని నాలుగైదు నెలలుగా వేచి చూస్తున్నామని, కానీ ఎవరూ కనీసం పట్టించుకోలేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ దశలో ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జోక్యం చేసుకుని చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఎంతమంది, వ్యతిరేకంగా ఎంతమంది ఉన్నారో తేలాలంటే చేతులెత్తే పద్ధతిని పాటించవచ్చునని, లేని పక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సమావేశమై ఒక నిర్ణయానికి రావచ్చునని అన్నారు. దీంతో సభ్యులను బయటకు పంపి నాయకులు చర్చిం చుకున్నారు. ఆ తరువాత అందరినీ లోపలకు రప్పించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నానని, అధినేత జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అంతవరకూ సంయమనం పాటించాలన్నారు. దీంతో కొందరు సభ్యులు లేచి వారం, పది రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లాలని అడగ్గా...నెల తరువాత తీసుకువెళతానన్నారు. అయితే జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్న సభ్యుల డిమాండ్‌కు నేతలు అంగీకరించలేదు. మరో ఏడాదిలో జడ్పీ కాలపరిమితి ముగుస్తోందని, అప్పటివరకూ అందరూ కలిసి వెళ్లాలని సూచించారు. సభ్యులంతా మాట్లాడినప్పటికీ చైర్‌పర్సన్ మాత్రం మౌనంగా ఉన్నారు. జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ చైర్‌పర్సన్ పదవి ఇస్తామన్న హామీతోనే అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానని గుర్తుచేస్తూ తనకు అన్యాయం జరిగిందన్నారు. ఈ దశలో బొత్స జోక్యం చేసుకుని అధినేతను కలిసి సమస్య విన్నవించుకోవాలన్నారు. ఇదిలావుండగా పార్టీ నేతల వద్ద ఏర్పాటుచేసిన పంచాయి తీలో ఏమీ తేలకపోవడంపై పలువురు జడ్పీటీసీ సభ్యులు బయటకు వచ్చి అసంతృప్తి వ్యక్తంచేశారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాల్సిందేనని కొందరు అన్నారు.

విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు

(5వ పేజీ తరువాయి)

నమోదయ్యాయి. వీటిలో ఇప్పటివరకూ 58,274 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదుచేసుకోగా, మొక్కల పెంపకానికి 56,395 మంది ముందుకువచ్చారు. ఒక్కొక్క విద్యార్థి ఒకటి నుంచి మూడు మొక్కలు తీసుకునేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు జిల్లాలో 89,040 మొక్కలు తీసుకునేందుకు విద్యార్థులు తమ పేర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద నమోదుచేసుకున్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్‌వరకు చదివే విద్యార్థులను గ్రీన్‌పాస్‌పోర్టులో నమోదుచేసి వారికి మొక్కలు అందజేస్తారు. సామాజిక అటవీ విభాగం నర్సరీల నుంచి శుక్రవారం వరకు జిల్లాలో పాఠశాలలకు 50,309 మొక్కలు చేరాయి. రవాణా ఖర్చులు పాఠశాలలు భరించాయి. విద్యార్థులకు సీమబాదం, ఎర్రచందనం, దేవకాంచనం, అంకుడు, గానుగు, తురాయి, మహాగని, మామిడి తదితర జాతులకు చెందిన మొక్కలు అందజేశామని జిల్లా అటవీ శాఖాధికారి జి.మంగమ్మ తెలిపారు. కాగా విద్యార్థులకు మొక్కల పంపిణీ నుంచి వాటిని నాటడం, పెంపకంపై ఉపాధ్యాయులు సూచనలు ఇస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత నెలకొంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని విద్యార్థులకు వివరించామన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితాలు

(5వ పేజీ తరువాయి)

13వ తేదీలోగా అర్జి పెట్టుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు ఆన్‌లైన్‌లో పరిశీలించి జాబితాలో పేరు లేకపోతే కారణాలు తెలుసుకుని వెంటనే సవరణ చేసి తహశీల్దారుకు పంపుతారన్నారు. ఇంకా మనమిత్రకు వాట్సాప్ ద్వారా 9552300009కు లేదా కాల్‌సెంటర్ నంబరు 155251కు కాల్ చేయాలని సూచించారు.

ఐఎఫ్ఆర్, మిలాన్ నిర్వహణపై సమీక్ష

(5వ పేజీ తరువాయి)

శాఖలు, విభాగాల అధిపతులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఈ సమావేశంలో నేవీ, విమానాశ్రయం, విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పోలీస్, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. నేవల్ ఆఫీస్ ఇన్‌చార్జి రజనీశ్‌శర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, నేవీ అధికారులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది ద్వారా చేయిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి 28 వరకూ పరిశీలన చేసి తుది జాబితా తయారుచేయడం జరుగుతుందన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. రూట్స్ యాప్ ద్వారా వివరాలను సేకరించి, ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి దిగ్విజయం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలనుపైకి తీసుకురావడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి విషయంలో బంగారు కుటుంబాలకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారన్నారు. సమీక్ష సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పీవీజీఆర్ నాయుడు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో కార్మికులదే కీలక పాత్ర

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీసీ అభివృద్ధిలో కార్మికులదే కీలక భూమిక అని ఆ సంస్థ విశాఖ రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు అన్నారు. సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆదర్శ కార్మికుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. గిరి ప్రదక్షిణలో షెటిల్ సర్వీసులుగా 55 బస్సులను, ఇతర ప్రాంతాల నుంచి 150 బస్సులను నడిపామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, ఏఈ సుధారాణి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ సామర్థ్యాల పెంపునకు సెషన్స్ దోహదం : డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (విశాఖ) నిర్వహించిన నాయకత్వ అభివృద్ధికి సంబంధించి ఇంటెన్సివ్ సెషన్స్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. నగరంలో ఐదు రోజులు జరిగిన ఈ సెషన్స్‌లో మహానది కోల్ ఫీల్డ్ లిమిటెడ్ (ఎంసీఎల్)కు చెందిన 21 మంది అధికారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ రంగ నిపుణులలో నిర్వహణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆధునిక ప్రభుత్వ రంగంలో సంక్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు కమ్యూనికేషన్, మేధస్సు, కార్పొరేట్ ఫైనాన్స్ సమర్థత వంటి నాయకత్వ లక్షణాలు అవసరమని డీఆర్ఎం అభిప్రాయపడ్డారు.

కళాశాలల్లో ప్రపంచ జనాభా దినోత్సవం

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఆర్థికశాస్త్ర విభాగం శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనాబా 'పెరుగుదల - సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో విద్యార్థులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ జనాభా పెరుగుదలను వాస్తవ అభివృద్ధిగా మలచాలంటే విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారిత వంటి అంశాలతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. జనాబా నియంత్రణలో యువత పోషించాల్సిన పాత్రను వివరించారు. అనంతరం ఏయూ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు.

జ్ఞానాపురం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లిఖిత మాట్లాడుతూ నేటి యువత కెరీర్ వైపు ఎ క్కువ దృష్టి పెట్టడం వల్ల వివాహం చేసుకోవడానికి, పిల్లలను కనడానికి ఇష్టపడడంలేదని అన్నారు. ఇది దేశ జనాభా, సంతానోత్పత్తి రేట్లపై ప్రభావితం చూపుతోందన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు వీడని 'తొలగింపు' భయం

- యాజమాన్యం నుంచి లభించని స్పష్టమైన హామీ
- కొనసాగుతున్న కార్మికుల తొలగింపు ప్రక్రియ
- భయంభయంగానే విధుల నిర్వహణ



ఉక్కుటౌన్‌షిప్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు భయం పోలేదు. నిత్యం భయం...భయంగానే విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు, ఇకపై కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదనే ప్రధాన డిమాండ్‌తో ఇటీవల ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. అయితే కార్మికవర్గం మాత్రం సమ్మెలో పాల్గొనేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో సమ్మెను విరమించుకుంటున్నట్టు కార్మిక సంఘాలు ప్రకటించాయి. అయితే కార్మికుల తొలగింపు అంశంపై మాత్రం పలుమార్లు ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల మధ్య చర్చలు జరిగినప్పటికీ యాజమాన్యం మాత్రం 'తొలగించబోమని' స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కొంత కాలం తరువాత ఈ తొలగింపు ప్రక్రియపై చర్చలు ఆపేస్తున్నట్టు ఆర్ఎల్‌సీ తెలిపారని నాయకులు పేర్కొన్నారు.

ప్లాంటులో పెద్ద మొత్తంలో 1503 మంది, మరోసారి 1750 మందిని తొలగించారు. ప్రస్తుత కాలంలో అయితే రోజుకు అడపాదడపా సుమారు ఇరవై మంది చొప్పున తొలగిస్తున్నారని కార్మిక నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంట్రాక్టర్‌కు పని కాలం ముగిస్తే తరువాత రెన్యూవల్ చేయకపోవడంతో ఆయా కాంట్రాక్టర్ల వద్ద పనులు చేసిన కార్మికులు మాత్రం పనులకు దూరంగా ఉన్నారు. ఇలా సుమారు ఏడు వందల మంది ఉన్నట్టు సమాచారం. అయితే ఇప్పుడు 'ఎవరిని తొలగిస్తారో....ఏ ప్రాతిపదికన తొలగిస్తారో' అనే భయం ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్మికుల్లో నెలకొంది.

ట్రాఫిక్ చలానాల డ్రైవ్



వాహన చలానాల వివరాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పెదగంట్యాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పెదగంట్యాడ జంక్షన్‌లో చలానాల డ్రైవ్ నిర్వహించారు. ఏఎస్ఐలు రాము, శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ చలానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన కారణంగా అనేక వాహనాలపై వేల రూపాయల్లో చలానాలు ఉన్నాయి. వీటిని గుర్తించి, చలానాలు కట్టించేందుకు న్యూపోర్టు పోలీసులు ట్రాఫిక్ చలానాల డ్రైవ్ నిర్వహించారు. బైక్‌లు, ఆటోలు, కార్లు ఇలా అన్ని రకాల వాహనాలను నిలిపి ఆయా వాహనాల నంబర్లను చెక్ చేశారు. వాటిపై ఈ చలానాలు ఉంటే వసూలు చేశారు. కానిస్టేబుళ్లు పీవీఎల్ నరసింహం, పైడిరాజు పాల్గొన్నారు.

మరిడిమాంబ అమ్మవారికి మకర తోరణం బహూకరణ



ఆలయ కమిటీకి మకరతోరణాన్ని అందజేస్తున్న దాతలు

అగనంపూడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి కొండయ్యవలస ప్రజల ఆరాధ్యదేవత మరిడి మాంబ అమ్మవారికి దాతలు సుబ్రహ్మణ్యం రాజు దంపతులు మకర తోరణాన్ని బహూకరించారు. శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు మకర తోరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి కన్నారావు, సాలాపు నరసింగరావు, సాయిన సన్యాసిరావు, విందుల వరహాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి దూరం

ఆటోనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : యోగాతో శారీరక, మానసిక ఒత్తిడిలు దూరమవుతాయని ఏఎస్‌డబ్ల్యూఎఫ్ సంస్థ చైర్‌పర్సన్ ఎం.అనురూప పేర్కొన్నారు. జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెంలో మహిళలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ అనేక రంగాల్లో విశిష్ట ప్రతిభ కలిగిన మహిళలు ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక వికాసం వైపు మళ్లేలా ఆటలు, పాటలు, ఆధ్యాత్మికత, యోగా, నృత్యాలు, మ్యూజిక్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా ప్రతి రోజూ చేయాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 31, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 48, దొండకాయలు 42, బంగాళ దుంపలు 18,అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 50, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 78, గోరుచిక్కుడు 38, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35,కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

శాకంబరీ దేవిగా దుర్గమాంబ అమ్మవారు



కూరగాయలతో అలంకరణలో దుర్గమాంబ

అగనంపూడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి దుర్గమాంబ ఆలయంలో ఆషాడమాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీగాదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని చీరలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయ ప్రాంగణంలో లలితా సహస్రనామ, విష్ణు సహస్ర పారాయణం చేశారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చెర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో ఎన్నో సంక్షేమం పథకాల అమలు

- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ



రాజీవ్ నగర్‌లో పథకాల కరపత్రాల పంపిణీలో టీడీపీ నేతలు నల్లూరు సూర్యనారాయణ, శ్రీనివాస్, రమేశ్ తదితరులు

కూర్మన్నపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నల్లూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని సమ ప్రాధాన్యంగా అందిస్తోందన్నారు. అనంతరం.. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనువాస్, రమేష్, సుబ్బయ్య, రామకృష్ణ రాజు, నాయుడు, నాగరాజు, నాగార్జున, గణపతి తదితరులు పాల్గొన్నారు.

జై ఆంధ్ర కాలనీలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం

సింధియా, జులై 11, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్ర కాలనీలో జిల్లా లెప్రసీ ఎయిడ్, టీబీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (టీబీ- ఎం.బీప ప్రోగ్రాం) కింద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ జెర్రిపోతుల నర్సింగరావు, సెక్రటరీ గుడేల కృష్ణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాసీవాలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ మీట్



సదస్సులో మాట్లాడుతున్న మధుసూధన్ రెడ్డి

ఆటోనగర్,జూలై 11 (ఆంధ్రజ్యోతి) :విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోషియేషన్ (వాసీవా) కార్యాలయంలో శుక్రవారం కెనరా బ్యాంకు రీజనల్ కార్యాలయం, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు ఏజీఎం ఎన్. మధుసూధన రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేవారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలైన మహిళా వికాస్, జీఎస్టీ, ఎంఎస్ఎంఈ స్టార్, వాహన, కరవాన్ తదితర స్కీమ్‌ల గురించి వివరించారు. ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, కమలేశ్వరిలు పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంఎస్ఎం ఈలకు అందించే రాయితీలను వివరించారు. పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఉన్నతాధికారులు జీవీవీ ప్రసాద్, రాజశేఖర్, వాసీవా కోశాధికారి పరుచూరి ప్రభాకర్, పారిశ్రామికవేత్తలు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, రామ్‌ప్రసాద్, బాపిరాజు, సత్యనారాయణ, కృష్ణప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

46 మందికి వైద్య పరీక్షలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

గోపాలపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతుబజారులో టి.బి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యూపీహెచ్‌సీ టి.బి యూనిట్ బృందం రైతులకు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా టి.బి. యూనిట్ బృంద సభ్యులు మాట్లాడుతూ రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉంటే తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.టి.బి సోకితే ఆందోళన చెందకుండా వైద్యుల పర్యవేక్షణలో మందుల ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం 46 మంది రైతులకు టి.బి. నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కనకారావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, రైతు బజారు ఈవో ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ సమస్య పరిష్కారం

ఎన్ఏడీ జంక్షన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డులోని మర్రిపాలెం ఉడాకాలనీ దరి రజకుల కాలనీలో సెప్టింక్ ట్యాంక్, యూజీడీ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పనులకు వార్డు టీడీపీ అధ్యక్షుడు వై. తిరుమలరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీడీ పైపులైన్ లీకేజీ వల్ల సెప్టింక్ ట్యాంక్ నిండి బయటకు రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని వారు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన రూ. 50 లక్షల జీవీఎంసీ నిదులు కేటాయించారు. ఈ పనులకు తిరుమలరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం. వాసుదేవరావు, పి.టి. నాయుడు, ఏఈ సుమన్, వాటర్ వర్క్స్ సహాయకుడు సన్యాసి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'సుఖీభవ' అర్హుల జాబితాలు సిద్ధం

పెందుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2808 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించారని మండల వ్యవసాయాధికారి చంద్రావతి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 5,534 మంది అనర్హుల జాబితాలో ఉన్నారని, వారంతా తమ అర్హతకు సంబంధించిన పత్రాలు సమర్పిస్తే వారిని కూడా అర్హుల జాబితాలో చేర్చుతామన్నారు. జాబితాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ



పలు వార్డుల ఆర్పీలతో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసి మహిళలు ఆర్థిక సాధికారత సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. శుక్రవారం ఆయన పిన్నమనేని ఫంక్షన్ హాల్‌లో 89, 90, 91, 92 వార్డులకు చెందిన మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన చేసే దిశగా ఆర్పీలు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్సీ హేమలత, కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, స్థానిక నాయకులు బొడ్డేటి విజయ్‌కుమార్, సత్తిరాజు పాల్గొన్నారు.

వేపగుంట : స్థానిక జోనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆర్పీలకు శుక్రవారం ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేరువగా సేవలను వేగవంతం చేయడానికి ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సుమారు 30 మంది ఆర్పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకర్రావు, జెడ్సీ హైమావతి, సూపరింటెండెంట్ పీవీవీఎస్ మూర్తి, ఏపీడీ చిరంజీవి, స్థానిక నాయకులు పిన్నింటి పార్వతి, దాట్ల మధు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గిరి ప్రదక్షిణ విజయవంతం

సింహాచలం దేవస్థానం ఈఓ త్రినాథరావు

సింహాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రదక్షిణ నగర ప్రజలందరి సహకారంతో విజయవంతమైందని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలెక్టరేట్‌లో కలిసి శాలువతో సత్కరించారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఆలయ వేద పండితులు అధికారులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రాథమిక అంచనా ప్రకారం గిరి ప్రదక్షిణలో రెండు రోజుల్లో సుమారు ఎనిమిది లక్షల మంది పాల్గొనగా, అప్పన్నను 1.10 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. జీవీఎంసీ, పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో దేవస్థానం అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ముందస్తు ప్రణాళికలతో పని చేయడం వల్ల ఉత్సవం విజయవంతమైందని చెప్పారు. ఉత్సవంలో భాగస్వాములైన వారందరికీ దేవస్థానం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈ వెంకట రమణ, డీఈఈ రామరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి సూచనలు చేస్తాం

- లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మదింపు చేసి వాటి పనితీరు మెరుగుపర్చేందుకు ప్రభుత్వానికి సూచనలు చేయనున్నట్టు ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉత్తరాంధ్రలోని ప్రభుత్వ రంగ సంస్థల అధికారులతో కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు తమ అకౌంట్లు, ఆడిట్‌పై పూర్తిస్థాయి సమాచారంతో కూడిన నివేదికలు అందజేసినప్పుడే తాము ప్రభుత్వానికి సరైన నివేదికలు సమర్పించగలమన్నారు. కాగా జీవీఎంసీ పరిధిలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలు, చేపట్టిన ప్రాజెక్టులను కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. వీఎంఆర్‌డీఏ చేపడుతున్న కార్యకలాలపై జాయింట్ కమిషనర్ రమేష్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిపై కమిటీ చైర్మన్ స్పందిస్తూ విశాఖ నగరాభివృద్ధి సంస్థకు సంబంధించి న్యాయ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేకంగా జ్యుడీషియల్ ప్యానల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఐఐసీ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములు సద్వినియోగం అయ్యేలా, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీకాకుళంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పనితీరుపై కమిషనర్ ప్రసాదరావు వివరించారు. పర్యాటక ప్రాజెక్టుల గురించి ప్రాంతీయ పర్యాటక డైరెక్టర్ జగదీష్ వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సి. బజాక్‌బాషా, నడికుదిటి ఈశ్వరరావు, ఆర్వీఎస్‌కేకే రంగారావు, గిడ్డి సత్యనారాయణ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, శాసన సభా కమిటీ సంయుక్త కార్యదర్శి పీవీ సుబ్బారెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, ఏపీఐఐసీ జడ్ఎం సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు అవసరం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ జగన్
- కణితి హైస్కూలులో డ్రైడే - ఫ్రైడే



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ జగన్, ఉపాధ్యాయులు, జీవీఎంసీ శానిటరీ, మలేరియా విభాగం

కూర్మన్నపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులకు గురికాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పేర్కొన్నారు. డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ శానిటరీ, మలేరియా విభాగం ఆధ్వర్యంలో 87 వార్డు కణితి హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న జగన్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లల్లో ఫ్రిడ్జ్‌లు, ఏసీలు, సమీపంలో కొబ్బరి బోండాలు, పాడైన పాత టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వారానికి ఒక రోజు డ్రైడేని పాటించాలన్నారు. పాలిథిన్ వలన ప్రజలకు మనుగడకు విఘాతం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నారాయణరావు, రాజన్‌రాజు, శానిటరీ అధికారులు, అప్పారావు, తిరుమల నగర్ వాసులు జి.విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, రాము, కామరాజు, ప్రభాకర్, సచివాలయ సిబ్బంది నరేష్ కుమార్, నీలిమ, సంధ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందజేస్తున్న మానవత్వ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

కూర్మన్నపాలెం,జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శ్రమిస్తే విజయాలు వరిస్తాయనీ, చదువుకు పేదరికం అడ్డుకాదని కణితి హైస్కూలు ప్రధాన ఉపాధ్యాయుడు ఆర్.నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులోని కణితి జడ్పీ హైస్కూలులో 2024-25లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.25 వేలు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహకాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింగరావు, ఉపాధ్యాయులు నారాయణరావు, ప్రసాద్, కౌసల్య, శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు మాటూరి రాము తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

ప్రజా దర్బార్‌తో సమస్యలు పరిష్కారం

పెందుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ 20 మంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి వారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి వంశీదీప్, సేనాపతి శంకరరావు, ఆళ్ల అప్పలరాజు, కునిగంటి కనకరాజు, చీర అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం : మేయర్ పీలా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని మేయరు పీలా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం 96వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో పెందుర్తిలోని యాతపేటలో జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో సాగిన విధ్వంసం, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెంటకోట రాజేంద్రప్రసాద్. కిల్లి రమేశ్, పీలా జితేంద్ర, వానపల్లి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

59వ వార్డులో జడ్సీ పర్యటన

మల్కాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూనగర్‌లో జోన్-5 కమిషనర్ రాము శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయం ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూను జీవీఎంసీ నడపాలి'

మల్కాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి (ఫస్ట్ రిఫరల్ యూనిట్) నిర్వహణను కోరమాండల్ కంపెనీకి ఇచ్చే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని 74వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు కోరారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీ ఆధీనంలో ఆరిలోవ, శ్రీహరిపురంలో ఎఫ్ఆర్‌యూలు ఉండగా, శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూను మురగప్పన్ గ్రూపునకు 30 ఏళ్ల పాటు నిర్వహణకు ఇవ్వడం సరికాదని చెప్పారు.

విశాఖకు షిప్‌యార్డు ఎంతో గర్వకారణం : ఎంపీ శ్రీభరత్


షిప్‌యార్డు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

మల్కాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) హేమంత్ ఖత్రీ, డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డు దేశంలోనే తొలి నౌకా నిర్మాణమని, ఇది విశాఖకు ఎంతో గర్వకారణమని తెలిపారు. దేశానికి షిప్‌యార్డు ఒక ఆస్తి అన్నారు. షిప్‌యార్డును కాపాడుకోవలసిన బాధ్యత ఎంతో ఉందన్నారు. సంస్థకు సంబంధించిన ప్రతీ సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హెచ్‌ఎస్‌ఎల్ జూనియర్, డిగ్రీ కళాశాలల పునరుద్ధరణ, సంస్థ దీర్ఘకాలిక స్థిరత్వం, రక్షణ రంగంలో హెచ్‌ఎస్‌ఎల్ ప్రాముఖ్యత, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, కొత్త వర్క్ఆర్డర్ల అవసరంపై అధికారులతో చర్చించారు. ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారితోనూ ఎంపీ శ్రీభరత్ సంభాషించారు. పీఎఫ్ బకాయిలు, ఆర్థిక ప్రయోజనాలు, క్రమబద్ధీకరణ, వైద్యసదుపాయాలు, ఉద్యోగోన్నతులలో ఆలస్యం, హెచ్‌ఎస్‌ఎల్ రెసిడెన్షియల్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై కూడా ఎంపీ మాట్లాడారు. కోవిడ్-19 సమయంలో నిలిపివేసిన సంక్షేమ ప్రయోజనాలను పునరుద్ధరించేలా చూడాలని ఉద్యోగులు ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. తన దృష్టికి వచ్చిన ప్రతి అంశంపైనా రక్షణ మంత్రిత్వ శాఖతో చర్చించి పరిష్కరించేలా చూస్తానని అన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం పరిమితం చేయడం న్యాయమా?

» వైసీపీ నేత బొత్స సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

మద్దిలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలకు పరిమితం చేయడం న్యాయమా? అని వైసీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని వైసీపీ శ్రేణులకు సూచించారు. మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన తూర్పు నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ ప్రజలను మభ్యపెట్టడానికేనని ఆరోపించారు. అప్పు చేసి తెచ్చిన డబ్బు ఎలా వినియోగిస్తున్నారో తెలియడం లేదన్నారు. తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలవాలని కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కార్పొరేటర్లు, నాయకులు రవిరెడ్డి, శివరామకృష్ణ, పీతల గోవింద్, పల్లా దుర్గారావు పాల్గొన్నారు.

వైసీపీ చెర నుంచి ప్రజలకు విముక్తి

» కూటమి ప్రభుత్వ పాలనతో అందరిలో సంతోషం

» మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, చిత్రంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తదితరులు

మల్కాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చెర నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని, కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 62వ వార్డు త్రినాథపురం ప్రాంతంలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలెవరూ వైసీపీ మాయమాటలను నమ్మవద్దని కోరారు. ప్రతి పనినీ రాజకీయం చేస్తున్నారని, ఇలాంటి తప్పుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) మాట్లాడుతూ వైసీపీ నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండండి.. వారి మోసాలకు మీరే బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. భవిష్యత్‌లో కూటమి పాలనతో ప్రజలకు మరింత మంచి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు వారికి హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి, 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, నాయకులు కొరిబిల్లి రాము, 61వ వార్డు టీడీపీ మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు భద్రత, పర్యావరణమే ముఖ్యం

» సీఐఐ సదస్సులో ఏపీపీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య. వేదికపై సీఐఐ చైర్మన్ మురళీకృష్ణ, ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర రెడ్డి తదితరులు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు నిర్వహించే యాజమాన్యం భద్రత, పర్యావరణం ప్రాధాన్య అంశాలుగా తీసుకొని సమీక్షా సమావేశాల్లో వాటిపై ముందుగా చర్చిస్తే అదే కింది స్థాయి వరకు వెళ్లి పర్యావరణ సమస్యలు ఉత్పన్నం కావని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. 'పరిశ్రమలలో కాలుష్య నియంత్రణ' అనే అంశంపై గ్రాండ్ బే హోటల్‌లో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంస్థ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పాటిస్తే ప్రమాదాలకే తావుండదన్నారు. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అదే విధంగా పరిశోధనలు పెంచుతూ, సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఇప్పించాలని సూచించారు. సీఐఐ చైర్మన్ జి.మురళీకృష్ణ మాట్లాడుతూ రోజుకు 36 వేల టన్నుల పరిశ్రమల వ్యర్థాలు విడుదల అవుతున్నాయని, వాటిలో 63శాతమే శుద్ధి చేస్తున్నారని ఒక నివేదిక వెల్లడించిందన్నారు. రియల్ టైమ్ ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్, జీరో లిక్విడ్ వేస్ట్ వంటివి అమలు చేయాలన్నారు. ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర రెడ్డి, ఏయూ ప్రొఫెసర్ బాలప్రసాద్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ యూనిట్ హెడ్ నరసింహ శాస్త్రి తదితరులు ప్రసంగించగా, వైస్ చైర్మన్ జి.కృష్ణమోహన్ సదస్సుకు అధ్యక్షత వహించారు. సీఐఐ మాజీ చైర్మన్ జి.సాంబశివరావు, విశాఖ సీఐఐ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ స్పెషల్ బస్సుల ఆదాయం రూ.22 లక్షలు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు గిరి ప్రదక్షిణ స్పెషల్స్ ఆదాయం రూ.22 లక్షలు వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి గిరి ప్రదక్షిణకు రాకపోకలు సాగించేవారి కోసం ఆర్టీసీ బుధ, గురువారాల్లో 210 ప్రత్యేక బస్సులు నడిపింది. బుధవారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం వరకు ఈ ప్రత్యేక సర్వీసులు నడిచాయి. రీజియన్‌లోని రామకృష్ణాబీచ్, పాత పోస్టాఫీసు, సింధియా, గాజువాక, ఉక్కునగరం, కొత్తవలస, ద్వారకా బస్‌స్టేషన్, దువ్వాడ రైల్వేస్టేషన్, విశాఖ రైల్వేస్టేషన్‌ల నుంచి సింహాచలం కాంప్లెక్సు వరకు ఈ బస్సులను నడిపారు. ఇవి కాకుండా విజయనగరం, కొత్తవలస, అనకాపల్లి, యలమంచిలి, తగరపువలస ప్రాంతాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపింది. అన్ని బస్సులు సగటున 90 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచాయి. వీటి ద్వారా రూ.22 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్టు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

క్రైం... crime news

చోరీ సొత్తు స్వాధీనం: నిందితుల అరెస్టు

» మూడుంపావు తులాల బంగారు ఆభరణాల రికవరీ


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ద్వారకా క్రైం ఏసీపీ బి.లక్ష్మణరావు

ఆరిలోవ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలోని వివేకానంద నగర్ ఆరో లైన్‌లో ఈ నెల 3న చోరీకి గురైన బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ద్వారకా ఏసీపీ బి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత డెయిరీ ఫారం వద్ద ఆరిలోవ నేరవిభాగం ఎస్ఐ హరికృష్ణ బృందం నిఘా వేసి నిందితుడ్ని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వివేకానందనగర్‌లో కుటుంబంతో ఉంటున్న వడ్డంగి అనే వ్యక్తి ఈ నెల 3న పార్వతీపురం సమీపంలోని తన అత్తవారింటికి వెళ్లాడు. 7న ఇంటికి వచ్చి చూసే సరికి పెరటి వైపు తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. లోపల బీరువాలో ఉంచిన బంగారు గొలుసు, బ్రాస్‌లెట్, ఉంగరం కనిపించలేదు. దీంతో 8న ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ హరికృష్ణ తన సిబ్బందితో దర్యాప్తు జరిపి నిందితుడు వి.సాయికుమార్ (23)ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడు నేరం అంగీకరించాడని, అతడి వద్ద నుంచి మూడుంపావు తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారన్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందన్నారు. వీటిని కొద్ది రోజుల్లో నగర పోలీసు కమిషనర్ ద్వారా సొత్తు పోగట్టుకున్న వ్యక్తికి అప్పగిస్తామన్నారు. ఎస్ఐ హరికృష్ణ బృందాన్ని ఏసీపీ అభినందించారు.

ఊరు వెళ్తే సమాచారం ఇవ్వండి

ఎవరైనా ఊరు వెళ్లినప్పుడు ముందుగా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇస్తే నిఘా ఏర్పాటు చేస్తామని, వీలైనంతవరకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ సూచించారు. ఇటీవల జరిగిన గిరి ప్రదక్షిణలో గొలుసు చోరీలు జరిగినట్లు నాలుగు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సమావేశంలో క్రైం విభాగం సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.


తల్లి మరణంతో కుంగిపోయి కుమారుడు ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తల్లి మరణాన్ని తట్టుకోలేక కుంగిపోయిన తనయుడు ఏడాదిన్నర తర్వాత ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాత వెంకోజీపాలెంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఆడారి అశోక్‌కుమార్(34) తన భార్య,నాలుగేళ్ల కుమారుడు, తండ్రితో కలసి పాత వెంకోజీపాలెంలో ఉంటున్నాడు. ఏడాదిన్నర క్రితం అశోక్‌కుమార్ తల్లి మృతి చెందారు.ఆమెతో అనుబంధం ఎక్కువగా ఉండే అశోక్‌కుమార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గురుపౌర్ణమి రోజున తన తల్లి గుర్తుకు వస్తోందని కుటుంబ సభ్యులతో అన్నాడు. కుటుంబ సభ్యులు ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి పడక గదిలో ఫ్యానుకు ఉరేసుకున్నట్లు గుర్తించి, వెంటనే వెంకోజీపాలెంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సీఐ మురళీ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న సాగర తీరంలో తలసేమియా రన్

» ముఖ్య అతిథులుగా నారా భువనేశ్వరి, కరణం మల్లేశ్వరి

» ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్ వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్, చిత్రంలో ఎగ్జిక్యూటివ్ అధికారి గోపి

మహారాణిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న విశాఖ సాగర తీరంలో 3 కె, 5 కె, 10 కె, రన్ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో కె.రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం హోటల్ దసపల్లాలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మంది చిన్నారుల జీవితాలను చిన్నాభిన్నం చేసే తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహిస్తున్నా మని పేర్కొన్నారు. 19న సాయంత్రం 4 గంటలకు ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుంచి రన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి అర్ధాంగి నారా భువనేశ్వరి, ఒలింపిక్ పతక గ్రహీత కరణం మల్లీశ్వరి హాజరవుతారని పేర్కొన్నారు. తలసేమియా జన్యుపరమైన వ్యాధి కావడంతో 21 రోజులకు ఓసారి రక్తం ఎక్కించి బాధితులను బతికించుకోవలసి ఉంటుందని తెలిపారు. వీరికి 10 నుంచి 12 మంది రక్తదాతలు అవసరమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్య, వైద్యం, విపత్తుల సమయంలో సహాయం, ఉపాధి కల్పన తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్టు ఎగ్జిక్యూటివ్ అధికారి ఎ.గోపి తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌ఎం కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ సూకరాజు తెలిపిన వివరాల మేరకు.. కోరాడ పవన్ కృష్ణ (33) తన భార్య, ఇద్దరు పిల్లలతో కేఆర్‌ఎం కాలనీలో ఉంటున్నాడు. డైలీ ఫైనాన్స్ కలెక్షన్ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గురువారం తన భార్యతో గొడవ పడ్డాడు. భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని మధ్యాహ్నం సమయంలో ఆర్కేబీచ్‌కు వెళ్లింది. పవన్ కృష్ణ భార్యకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. సాయంత్రం ఆరున్నర సమయంలో ఇంటికి వెళ్లిన భార్యకు ఇంట్లో భర్త లేకపోవడం, ఫోన్‌కు స్పందించకపోవడం, ఆచూకీ కోసం ప్రయత్నించినా దొరక్కపోవడంతో ఎంవీపీ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న తెలంగాణకు చెందిన షేక్ ముజాహిద్ హుస్సేన్(27), ఒడిశావాసి పంచానన్ సాహు (40)లను శుక్రవారం పట్టుకుని వారి నుంచి గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.. ఇద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

లంకెలపాలెం కూడలిలో తప్పిన పెను ప్రమాదం

» ఫ్రీలెఫ్ట్ నుంచి దూసుకు పోయిన ట్రాలర్ లారీ

లంకెలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో పెను ప్రమాదం తప్పింది. ఐరన్ బుల్లెట్లు లోడుతో వస్తున్న ట్రాలర్ లారీ అదుపు తప్పి ఫ్రీలెఫ్ట్ నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. గురువారం రాత్రి 11.30 గంటల


ఫ్రీలెఫ్ట్ నుంచి దూసుకుపోయిన ట్రాలర్ లారీ

సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. స్టీల్‌ప్లాంట్ నుంచి ఐరన్ బుల్లెట్లతో ఖమ్మం బయలుదేరిన ట్రాలర్ లారీ లంకెలపాలెం కూడలికి వచ్చేసరికి అదుపు తప్పి పరవాడ వెళ్లే ఫ్రీలెఫ్ట్ రోడ్డులోకి దూసుకొచ్చింది. రహదారి మధ్యలో గల సిమెంట్ దిమ్మలను ఢీకొని రహదారి పక్కన గల డ్రైనేజీలోకి దిగి నిలిచింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ట్రాలర్ లారీ ముందు భాగం దెబ్బతింది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ప్రమాదం జరిగిన సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పరవాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో ట్రాలర్‌ను తొలగించారు. ఈ మేరకు పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.